తొలివార్త

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com

best deal

HEALTH & WEALTH

"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."

We create opportunities | 9640707117 (What's up only)

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 183 ఆదివారం 08 - 11 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు

తాగునీటికే పరిమితం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్
- ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం
- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ
- రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు



తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 07 :

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు - మిగతా 2 లో

కొడంగల్ టెండర్లలో

పొంగులేటి కంపెనీకి లబ్ధి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్
- రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ
- ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ



ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు నిండాలి

- సీఎం రేవంత్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు
- చెడుపై మంచి విజయానికి ప్రతీక దీపావళి
- కాలుష్యరహితంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలి
- ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 07 :

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా 2 లో

'ట్రంప్‌ను ఇకపై నమ్మలేం'

- అమెరికా దాడుల భయంతో ప్రజలకు అయోడిన్ మాత్రలు పంచుతున్న ఇరాన్!
- అమెరికా నుంచి సైనిక దాడి జరగవచ్చనే ఆందోళనలతో అప్రమత్తమైన ఇరాన్
- అణు కేంద్రాల సమీపంలో నివసించే ప్రజలకు అయోడిన్ మాత్రలు పంపిణీ
- రేడియోధార్మికత నుంచి థైరాయిడ్ గ్రంథిని కాపాడేందుకు ఈ చర్య
- విదేశీ మీడియా కథనాలను ఖండించిన ఇరాన్.. కానీ మాత్రల పంపిణీని ధ్రువీకరించిన వైనం
- ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా కఠిన వైఖరితో పెరిగిన ఉద్రిక్తతలు



తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 07 :

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం కీలక ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తమ అణు కేంద్రాలపై అమెరికా సైనిక దాడి చేయవచ్చనే ఆందోళనల మధ్య, ఆయా కేంద్రాల సమీపంలో నివసించే ప్రజలకు అయోడిన్ మాత్రలను పంపిణీ చేస్తోంది. అణు ప్రమాదం జరిగినప్పుడు వెలువడే రేడియోధార్మిక అయోడిన్ నుంచి థైరాయిడ్ గ్రంథిని కాపాడుకోవడానికి ఈ మాత్రలు ఉపయోగపడతాయి. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల తీవ్రతను తెలియజేస్తోంది.లండన్‌కు చెందిన 'ది టైమ్స్' పత్రిక కథనం ప్రకారం.. ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అణు కేంద్రాలకు రెండు నుంచి మూడు కిలోమీటర్ల పరిధిలో ఈ మాత్రలను పంపిణీ చేస్తున్నామని, ఇది యుద్ధ సమయాల్లో తీసుకునే ఒక సాధారణ చర్య అని ఆయన పేర్కొన్నట్టు ఆ పత్రిక తెలిపింది."అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇకపై నమ్మలేమని, ఆయన దాడులకు దిగే అవకాశం ఉంది" అని ఆ అధికారి వ్యాఖ్యానించినట్లు కథనంలో పేర్కొన్నారు.మరోవైపు, ఇరాన్ అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు అవసరమైతే మరిన్ని సైనిక - మిగతా 2 లో

ఇ 20 కాస్తా

420గా మారింది



- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి
- పెట్రోల్‌లో పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారని ఆయిల్ కంపెనీలపై రాహుల్ ఆరోపణ
- తమపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండించిన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు

తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 07 :

దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి - మిగతా 2 లో



దీపావళి ధమాకా..

దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల వ్యాపారం!

- దీపావళి సీజన్‌లో దేశంలో రూ.5 లక్షల కోట్ల వ్యాపారం అంచనా
- ఒక్క ఢిల్లీలోనే రూ.80,000 కోట్ల టర్నోవర్ అంటున్న సీటీఐ
- స్వదేశీ వస్తువులు, చేతివృత్తుల ఉత్పత్తులకు భారీ గిరాకీ
- రికార్డు స్థాయిలో 55 శాతం పెరిగిన ఆటోమొబైల్ అమ్మకాలు
- నష్టాల నుంచి కోలుకుని లాభాల బాట పట్టిన ఢిల్లీ వ్యాపారులు

తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 07 :

దేశవ్యాప్తంగా దీపావళి పండుగ సీజన్ వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సీజన్‌లో సుమారు రూ.5 లక్షల కోట్ల భారీ వ్యాపారం జరుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. దేశ రాజధాని ఢిల్లీలోనే దాదాపు రూ.80,000 కోట్ల వాణిజ్యం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ పండుగ సీజన్ దేశవ్యాప్తంగా వ్యాపారులకు - మిగతా 2 లో

ఆకాశమే హద్దుగా

భారత వాయుసేన ప్రపంచ రికార్డు

- లడఖ్‌లో భారత వాయుసేన చారిత్రక ఘనత
- 13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్
- న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో విజయవంతంగా దిగిన విమానం
- తక్కువ గాలి సాంద్రతలో ల్యాండింగ్ చేయడం సవాలు

తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 07 :

లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ.. ఐఎల్-76ఎండీ రవాణా విమానాన్ని మిగతా 2 లో



స్థానిక ఎన్నికల్లో

కూటమి అభ్యర్థుల ప్రభంజనం



- స్థానిక సంస్థల ఎన్నికలు భారీ మెజారిటీతో అభ్యర్థుల రికార్డు విజయం
- స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఘన విజయం సాధించారు
- ప్రత్యర్థులపై వేల ఓట్ల ఆధిక్యంతో రికార్డులు సృష్టించారు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజారిటీలతో అభ్యర్థుల రికార్డు విజయం


తొలివార్త,అమరావతి, నవంబర్ 07 :

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో పలువురు అభ్యర్థులు ఊహించని రీతిలో భారీ మెజారిటీలతో ఘనవిజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. కూటమి తరపున పోటీ చేసిన పలువురు అభ్యర్థులు తమ ప్రత్యర్థులపై వేల ఓట్ల ఆధిక్యంతో రికార్డులు సృష్టించారు. రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నమోదు చేసిన టాప్ మెజారిటీల వివరాలు ఇలా ఉన్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల్లో పలువురు అభ్యర్థులు భారీ మెజారిటీలతో ఘనవిజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట లక్ష్మి సరోజ తన సీపీఎం ప్రత్యర్థిపై 32,919 ఓట్ల మెజారిటీతో రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నమోదైన ఫలితాల్లో ఇదే అత్యధిక - మిగతా 2 లో

విశాఖ వేదికగా

గ్లోబల్ సమ్మిట్

- ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం
- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'
- 59 దేశాల నుంచి 1250 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం
- ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సమీక్ష
- వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ సహా ఆరు కీలక రంగాలపై ప్రధానంగా చర్చలు
- పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం 400 బీటుబీ సమావేశాలు



తొలివార్త,అమరావతి, నవంబర్ 07 :

విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో నిర్వహించే ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సీఐఐ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానించడం ద్వారా చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరం అనే - మిగతా 2 లో



ఓట్ల లెక్కింపునకు ముందే

ఎంపీటీసీ అభ్యర్థి మృతి

- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో విషాదం
- అనారోగ్యంతో కన్నుమూసిన దివ్య
- జనసేనలో క్రియాశీలంగా పని చేస్తున్న దివ్య, ఆమె భర్త శ్రీనివాస్

తొలివార్త,అమరావతి, నవంబర్ 07 :

తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఒకరోజు - మిగతా 2 లో

సంపాదకీయం

ఎన్నారై వేషాలకు చెక్!



విదేశాల్లో కొలువనీ, లక్షల్లో జీతమనీ, అక్కడ కులాసా జీవితమనీ కబుర్లు చెప్పి పెళ్లాడి తీరా అక్కడికెళ్లాక నరకం చూపించేవారికి, అక్కడి కోర్టుల్లో సులభంగా విడాకులు తీసుకునేవారికి సర్వోన్నత న్యాయస్థానం ఝలక్ ఇచ్చింది. అలాంటి విడాకులు ఇక్కడ చెల్లుబాటుకావనీ, ఆ ప్రాతిపదికన చేసుకునే మారు వివాహం బహుభార్యత్వం కింద నేరమే అవుతుందనీ మంగళవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి వైద్యుడొకరు అక్కడి న్యాయస్థానం మంజూరు చేసిన విడాకుల ఆధారంగా రెండో పెళ్లి చేసుకున్న ఉదంతంలో ఈ తీర్పు వెలువడింది. పెళ్లి చేసుకుని ఎన్నో కలలతో విదేశాలకెళ్లే యువతులు సమస్యలు ఎదుర్కొనటం అంతకుముందూ ఉండొచ్చుగానీ... 90వ దశకంలో సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి చెందాక ఈ మాదిరి కేసుల సంఖ్య పెరుగుతోంది. ఎన్నోవిధాల వాకబుచేసి, కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకుని చేసే పెళ్లిళ్లు సైతం ఏవేవో కారణాలతో పెటాకులవుతున్నాయి. ఊహించని ఈ పరిణామాలతో మధ్యతరగతి తల్లిదండ్రులుబెంగటిల్లి ఏం చేయాలో తోచక అవస్థలు పడుతున్నారు. మధ్యవర్తుల ద్వారానో, స్వయంగానో పరిష్కరిద్దామంటే దేశంకాని దేశంలో ఉండే అల్లుళ్లు ఫోన్‌కు కూడా దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. వెళ్లటం దుర్లభమై, వెళ్లినా ఫలితం ఉంటుందన్న ఆశ కూడా లేక అలాంటివారు కుమిలిపోతున్నారు. ఈ బాపతు యువకుల్లో రకరకాలవారుంటారు. విమానం ఎక్కేవరకూ ఒకలా ఉండి, అటుతర్వాత అదనపు కట్నం ఆశించో, ఇతరే తరమైన ఆలోచనలతోనో ఆడపిల్లల్ని చిత్రహింసలపాలు చేస్తున్నారు. మరికొందరుపెళ్లి చేసుకుని, ముచ్చటన్నీ తీర్చుకుని మళ్లీ వచ్చి తీసుకెళ్తామంటూ కథలు చెప్పి మాయమవుతున్నారు. ఇలాంటి ఉదంతాల్లో వస్తున్న ఫిర్యాదుల సంఖ్య అంతకంతకు పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2018లోనే భారతీయ శిక్షాస్మృతిలో అవసరమైన నిబంధ నలు చేర్చాలని నిర్ణయించింది. రెండేళ్లక్రితం క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలొచ్చాయి. కానీ సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ) మాత్రం యథాతథంగా కొనసాగుతోంది. అందులోని సెక్షన్ 13 విదేశీ న్యాయస్థానాల ద్వారా పొందే విడాకులు ఇక్కడ చెల్లుబాటు కావని చాలా స్పష్టంగా చెప్పింది. ఆ తీర్పుల ఆధారంగా మరో పెళ్లి చేసుకుంటే భారతీయ చట్టాల దృష్టిలో అది చెల్లుబాటుకాదని ఆ నిబంధన చెబుతోంది. అలాంటివారిపై బహుభార్యత్వం కింద భారతీయ శిక్షాస్మృతిలోని 494 కింద కేసు నమోదు చేయొచ్చని ఆ నిబంధన అంటున్నది. ఇప్పుడు సుప్రీంకోర్టు దాన్నే మరోసారి చెప్పింది. ఈ దేశంలో పెళ్లాడి, ఇక్కడ కొంతకాలం గడిపి వెళ్లేవారెవరైనా ఇక్కడి చట్టాల ఆధారంగా ఫ్యామిలీ కోర్టుల్లో మాత్రమే పిటిషన్లు దాఖలుచేసి విడాకులు పొందాలని వివరించింది.సత్తెనపల్లివాసి అతి తెలివికి పోయాడు. భార్య కాన్పు కోసం భారత్ తిరిగిరావటాన్ని ఆసరా చేసుకుని శాశ్వతంగా ఆమెను వదిలించుకునే ఎత్తుగడ పన్నాడు. దాంపత్యజీవితంలో పొరపొచ్చాలు వచ్చాయి గనుక విడాకులిప్పించాలంటూ నర్సరావుపేట కోర్టులో వేసిన పిటిషన్ తోసిపుచ్చడంతో హైకోర్టును ఆశ్రయించాడు. అక్కడా తనకు అనుకూలంగా తీర్పు రాకపోవటంతో బ్రిటన్ పౌరసత్వం వచ్చేవరకూ ఆగి అక్కడికేంబ్రిడ్జి కౌంటీ కోర్టులో విడాకులు పొందాడు. చాలామంది ఎన్నారైలు చేసే పని ఇదే. కానీ హిందూ వివాహ చట్ట నిబంధనల ప్రకారం వివాహమాడినవారు వేరే దేశాల కోర్టుల్లో విడాకులు పొందినా చెల్లుబాటుకాదని గతంలోనూ కోర్టులు చెప్పాయి. విదేశీ యులకు వెసులుబాటిచ్చే ఐపీసీలోని సెక్షన్ 4 వర్తించబోదని కూడా స్పష్టంచేశాయి.ఇలాంటి కేసుల్లో అనుసరించదగిన నియమాలను 1991లోనే సుప్రీంకోర్టు నిర్ధారించింది. కానీ ఏదో వంకన దీర్ఘకాలం వ్యాజ్యం కొనసాగిస్తూ అత్తింటివారిని ఆర్థికంగా దెబ్బతీస్తే, విసుగుచెంది రాజీ మార్గానికొస్తారని, సులభంగా వదిలించుకోవచ్చని చాలామంది భావిస్తున్నారు. గత దశాబ్దకాలంలో ఈ మాదిరి ఎన్నారై విడాకుల కేసులు 35 శాతం మేర పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. వాటిల్లో న్యాయస్థానాల పరిధి ప్రశ్నార్థకమైన కేసులే 60 శాతం పైగా ఉన్నాయి. ఇలాంటి వంచకుల ఆటకట్టించే క్రమంలో తాజా సుప్రీంకోర్టు తీర్పు ఒక ముందడుగు.

విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి - భరోసాను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.ఈ సదస్సులో మొత్తం 1,250 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా, ఈజిప్ట్ వంటి అనేక దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు హాజరుకానున్నారు. అలాగే, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు కీలక అంశాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం-పెట్టుబడులు, వ్యవసాయం-ఆహార భద్రత, నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి, టెక్నాలజీ-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.వ్యాపార సంస్థల మధ్య కొత్త ఒప్పందాలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు 400కు పైగా బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బిజినెస్ టు గవర్నమెంట్ (బీటుజీ) సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు వస్తుందని, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ప్రభంజనం

మొదటిపేజీ తరువాయి - మెజారిటీ కావడం విశేషం. పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలం నుంచి జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన పామిడిపాటి శ్రీనివాసరావు, 30,273 ఓట్ల మెజారిటీతో తన సత్తా చాటారు.క్రోసూరు మండలంలో మొత్తం 38,000 ఓట్లు పోల్ కాగా, ఆయన సాధించిన ఈ భారీ విజయం జనసేన శ్రేణుల్లో సంబరాలకు దారి తీసింది. నుజెండ్ల మండలంలో కూటమి మద్దతుతో పోటీ చేసిన జనసేన జడ్పీటీసీ అభ్యర్థి సింగంశెట్టి వెంకట బాల ప్రసాద్ 28,863 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మాచవరం మండలంలో కూటమి తరపున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి కత్తి సరోజిని, తన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్సీపీ అభ్యర్థి దొండెటి వెంకయ్యమ్మపై 22,882 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గురజాల మండలంలో టీడీపీ అభ్యర్థిగా జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసిన మద్దినేని లక్ష్మి, తన సమీప ప్రత్యర్థిపై 17,000కు పైగా ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. పిడుగురాళ్ల జడ్పీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన ఉన్నం దీపిక, 20,167 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు.ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు.ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

ఆకాశమే హద్దుగా భారత వాయుసేన ప్రపంచ రికార్డు

మొదటిపేజీ తరువాయి - 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది.ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు, వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది.చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో సైనికపరంగా



దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని.రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

'ట్రంప్‌ను ఇకపై నమ్మలేం'

మొదటిపేజీ తరువాయి - చర్యలు చేపట్టే అంశాన్ని అమెరికా అధికారులు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అత్యంత పటిష్ఠమైన భద్రత కలిగిన 'పికాక్స్ మౌంటెన్' అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశంపై కూడా చర్చలు జరుగుతున్నాయి. దాడుల పునరుద్ధరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని స్వయంగా ట్రంప్ వ్యాఖ్యానించడం ఈ ఆందోళనలకు మరింత బలాన్నిచ్చింది.గతంలో ఇరు దేశాల మధ్య జరిగిన సైనిక దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో తాజా పరిణామాలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరాన్ అధికారికంగా ఖండించినప్పటికీ, అణు కేంద్రాల వద్ద అయోడిన్ మాత్రల పంపిణీ జరగడం.. సంభావ్య దాడి ముప్పును ఎదుర్కొనేందుకు ఆ దేశం ఎంత తీవ్రంగా సన్నద్ధమవుతోందో సూచిస్తోంది.

ఇ 20 కాస్తా 420గా మారింది

మొదటిపేజీ తరువాయి - మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇ20 కాస్తా 420గా మారింది -- ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు.కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి.భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు.అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి. ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దీపావళి ధమాకా.. దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల వ్యాపారం!

మొదటిపేజీ తరువాయి - గొప్ప అవకాశాలను తెచ్చిపెట్టిందని అన్నారు. ముఖ్యంగా వినియోగదారుల నుంచి స్వదేశీ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ కనిపిస్తోందని తెలిపారు. గత నెలలో ర్యాలీలు, నిరసనల కారణంగా వ్యాపార నష్టాలను ఎదుర్కొన్న ఢిల్లీ వ్యాపారులు, ఈ దీపావళి అమ్మకాలతో ఆ నష్టాలను పూడ్చుకుని లాభాల బాట పడతామని ఆశిస్తున్నారని ఆయన వివరించారు.దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా ఉన్నాయని చెప్పడానికి ఆటోమొబైల్ అమ్మకాలే నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం.. రిటైల్ ఆటోమొబైల్ అమ్మకాలు 55 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలు 70 శాతం, ద్విచక్ర వాహనాలు 52 శాతం, త్రీ-వీలర్లు 110 శాతం వృద్ధిని నమోదు చేశాయని, ఇది బలమైన వినియోగదారుల డిమాండ్‌కు సంకేతమని అన్నారు.ఈ ఏడాది పండుగ సీజన్‌లో స్వదేశీ వస్తువులకే ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గోయల్ తెలిపారు. మట్టి ప్రమిదలు, దేవుళ్ల విగ్రహాలు, హస్తకళా ఉత్పత్తులు, గోడ అలంకరణ వస్తువులు, శుభ్-లాభ్, ఓం వంటి సాంప్రదాయ చిహ్నాలకు మంచి డిమాండ్ కనిపిస్తోందన్నారు. స్థానిక కళాకారులు, చేతివృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలు కూడా భారతీయ ఉత్పత్తులకు మరింత గుర్తింపునిచ్చి, స్థానికంగా తయారైన వస్తువులకు డిమాండ్‌ను బలోపేతం చేశాయని సీటీఐ తన ప్రకటనలో పేర్కొంది.వీటితో పాటు ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఫ్యాషన్ అపెరల్, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, ఫర్నిచర్ వంటి రంగాల్లో కూడా భారీ వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా సుమారు 5 కోట్ల బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారని, ఇది కూడా అమ్మకాలను పెంచుతోందని తెలిపారు.ఢిల్లీలోని చాందినీ చౌక్, సదర్ బజార్, కమలా నగర్, రాజౌరీ గార్డెన్, లజపత్ నగర్ వంటి ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మొబైల్ ఫోన్లు, గిఫ్టులు, డ్రై ఫ్రూట్స్, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని, ఇది రాజధానిలో పుంజుకున్న వ్యాపార కార్యకలాపాలకు సూచిక అని గోయల్ పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ముందే ఎంపీటీసీ అభ్యర్థి మృతి

మొదటిపేజీ తరువాయి - ముందు జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి అనారోగ్యంతో కన్నుమూశారు. దేవరపల్లి మండలం ధుమంతునిగూడేనికి చెందిన గారపాటి దివ్య (26) శుక్రవారం రాజమండ్రిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.వివరాల్లోకి వెళితే, ధుమంతునిగూడెం ఎంపీటీసీ స్థానం నుంచి జనసేన తరపున దివ్య పోటీ చేశారు. గురువారం పోలింగ్ ముగిసిన తర్వాత ఆమె అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ట్రిక్ సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాత్రికి ఆమెను ఇంటికి తీసుకువచ్చారు.అయితే, నిన్న ఉదయం ఆమె ఆరోగ్యం మళ్లీ విషమించడంతో తిరిగి అదే ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దివ్య, ఆమె భర్త శ్రీనివాస్ జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దివ్యకు నాలుగు నెలల బాబుతో పాటు మరో కుమారుడు కూడా ఉన్నాడు. ఈరోజు ఓట్ల లెక్కింపు జరుగుతున్న తరుణంలో దివ్య హఠాన్మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తాగునీటికే పరిమితం

మొదటిపేజీ తరువాయి - ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు.మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళు_న్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు.కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళు_న్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా



ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు నిండాలి

మొదటిపేజీ తరువాయి - రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. దీపాల వెలుగులతో ఇళ్లను, పరిసరాలను అలంకరించుకుని



ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని, ప్రజల జీవితాలు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, శాంతిసౌభాగ్యాలతో వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కాలుష్యానికి తావులేకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారులు, పెద్దలు సురక్షిత వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

కౌంటింగ్ కేంద్రాల్లో 'కనీస' కష్టాలు

ఆకలిదప్పులతో సిబ్బంది, ఏజెంట్ల ఆందోళన

ఏపీ పరిషత్ కౌంటింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి

తాగునీరు, అల్పాహారం లేకపోవడం, ఉక్కపోతతో సిబ్బంది,

ఏజెంట్లు తీవ్ర ఇబ్బందులు పడి ఆందోళనలకు దిగారు

ఆంధ్రప్రదేశ్‌లో పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో గందరగోళం నెలకొంది. కౌంటింగ్ కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడం వివాదాస్పదమైంది. ఉదయం నుంచే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, ఏజెంట్లు ఆకలిదప్పులతో అలమటించారు. కనీసం తాగునీరు, అల్పాహారం కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలు జిల్లాల్లో అధికారులు, సిబ్బంది మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. సరైన గాలి, వెలుతురు లేక ఉక్కపోతతో నరకం అనుభవించారు.గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది ఆందోళనకు దిగారు. ఉదయం 6 గంటలకే విధులకు హాజరైన సిబ్బందికి అధికారులు కనీసం అల్పాహారం కూడా సరిగా ఏర్పాటు చేయలేదు. గంట సేపు క్యూలైన్లో నిలబడిన తర్వాత టిఫిన్ లేదనటంతో సిబ్బంది మండిపడ్డారు. విధులకు వచ్చిన వారిని ఆహారం విషయంలో ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఆకలితో విధులు ఎలా నిర్వర్తించాలంటూ పలువురు కౌంటింగ్ కేంద్రం బయటే ఉండిపోయి నిరసన తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఏజెంట్లు, అభ్యర్థులు ఆందోళన చేశారు. కేంద్రంలో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. గది ఇరుకుగా ఉండటం, గాలి కూడా సరిగా ఆడకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇదే సమయంలో లోపలికి వెళ్లిన ఏజెంట్లందరినీ అధికారులు బయటికి పంపడంతో వారు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు లెక్కింపు కేంద్రంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యంతో కౌంటింగ్ నత్తనడకన సాగింది. మధ్యాహ్నం వరకు కూడా బ్యాలెట్ పత్రాలను వేరు చేసే ప్రక్రియే కొనసాగింది. కేంద్రంలో తీవ్ర ఉక్కపోతతో సిబ్బంది, ఏజెంట్లు నరకయాతన అనుభవించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు కౌంటింగ్ కేంద్రం వద్ద లెక్కింపు సిబ్బంది అధికారుల తీరుపై భగ్గుమన్నారు. ఉదయం నుంచి విధుల్లో ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయలేదని



ఆరోపించారు. కనీసం తాగేందుకు మంచినీళ్లు కూడా అందుబాటులో ఉంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తాము ఇబ్బంది పడుతున్నామని, వెంటనే తమ సమస్యలను పట్టించుకోవాలని సిబ్బంది డిమాండ్ చేశారు.శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద కూడా ఇలాంటి పరిస్థితే కనిపించింది. ఇక్కడ ఏజెంట్లకు అల్పాహారం, తాగునీరు సమకూర్చలేదు. దీంతో వారు అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై పలు పార్టీల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు అధికారులు స్పందించి, వెంటనే అల్పాహారం తెప్పిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రతి గడప మా కడప.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com

పి ఎస్ ఎస్ ఎం వ్యవస్థాపకులు

బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జన్మదినం నవంబర్ 11



నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, నవంబర్ 07 (తొలివార్త): పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా పి ఎస్ ఎస్ ఎం వ్యవస్థాపకులు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జన్మదినం నవంబర్ 11 సందర్భంగా.టి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ కమిటీ ఆధ్వర్యంలో పత్రీజీ జన్మించిన నిజామాబాద్ జిల్లాలో నవంబర్ ఒకటవ తేదీ నుండి నవంబర్ 11వ తేదీ వరకు 11 రోజులపాటు 11 మండలాలలో పత్రీజీ మహా అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని పి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా 7 వ తేదీ 7 వ రోజు నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో మల్లయ్య గుడి ప్రాంగణంలో రామలింగేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద అత్యంత ఘనంగా పత్రీజీ మహావతరణ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు ఆత్మీయ విశిష్ట అతిథిగా పి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి హాజరై ప్రతిరోజు ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని ఈ ధ్యానం వల్ల శారీరక మానసిక సమస్యలు దూరమై మనస్సు నిశ్చలమైన స్థితిలో ఉండి ప్రశాంతంగా జీవిస్తారన్నారు ఎందరో మంది ఋషులు మునులు యోగులు ధ్యానం చేసి గొప్ప శక్తివంతులయ్యారన్నారు. కావున సమస్త మానవులందరూ ధ్యానం చేసి గొప్పగా జీవించాలని తెలిపారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధులు దూరం అవుతాయి అన్నారు. వెల్మల్ గ్రామ ధ్యాన బంధువులు వచ్చిన వారందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వెల్మల్ గ్రామ ధ్యాన బంధువులు నాగ భూమన్న, కండల గంగాధర్, సుంక భోజన్న, నారాయణ, బైన కిషన్, రాములు 300 మందికి పైగా ధ్యాన బంధువులు పాల్గొన్నారు.

వజ్జా పొట్టమ్మ బొబ్బల సాయమ్మ వారి భౌతికకాయానికి

పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన

ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు





భద్రాద్రి జిల్లా నవంబర్ 7(తొలి వార్త) అశ్వాపురం మండల పరిధిలోని గొల్లగూడెం సర్వాయిపాడు బంజరా గ్రామాలకు చెందిన వజ్జా పొట్టమ్మ,బొబ్బల సాయమ్మ, లు, వారు మరణించిన విషయం తెలుసుకున్న వెంటనే పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే,తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు వాళ్ల గృహాలకు వెళ్లి, మృతి చెందిన వారి భౌతికకాయానికి పూలమాలలు,వేసి,ఘనంగా,నివాళులర్పించారు. ఈ సందర్భంగా, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ,ఈ విషాద సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు.వజ్జా పొట్టమ్మ,బొబ్బల సాయమ్మ, లు, మృతి పట్ల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేస్తూ,మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా నాయకులు,గాదె కేశవరెడ్డి వరలక్ష్మి కస్టక్షన్ అధినేత వేములపల్లి రమేష్, మాజీ సర్పంచ్ పోడియం అనిల్ కుమార్,నాయకులు, బొబ్బల నాగేష్, గొల్లపల్లి నరేష్ కుమార్ విజయ్ నవీన్, సర్పంచులు ఉప సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సందేళ్ల రామారంలో రూ.15 లక్షలతో

నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన

ఎమ్మెల్యే ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు





భద్రాద్రి జిల్లా నవంబర్ 7(తొలి వార్త) బూర్గంపాడు మండలం ముసలమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని సందేళ్ల రామారం గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్ల వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు సీసీ రోడ్ల నిర్మాణంతో తొలగిపోతాయని, గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు.గ్రామాల సమగ్ర అభివృద్ధికి రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు ఎంతో అవసరమని, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎంపీడీవో, మండల అధ్యక్షులు పి. సుధాకర్ రెడ్డి, జిల్లా ముఖ్య మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి గ్రామపంచాయతీల సర్పంచులు, పూనెం సురేందర్, తాటివాని ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, తంగెళ్ల జంపన్న, జిల్లా యువజన నాయకులు కారం శ్రావణ్ మహిళా నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంతంగి లొ మద్యపాన నిషేధం..

బెల్ట్ షాపుల బంద్ కై అఖిలపక్ష గ్రామసభ..!

గ్రామంలో బెల్ట్ షాపులు పూర్తిగా బంద్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం

పోలీసుల పూర్తి సహకారం ఉంటుందన్న సీఐ సతీష్ రెడ్డి





చౌటుప్పల్,నవంబర్07 (తొలివార్త): చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో మద్యపాన నిషేధం,బెల్ట్ షాపుల బంద్ కై అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా బంద్ అమలు చేయాలని గ్రామసభ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ గ్రామసభకు ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ సీఐ దేవిరెడ్డి సతీష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ సతీష్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామంలో అఖిలపక్ష పార్టీలు మరియు పాలకవర్గం తీసుకున్న ఈ నిర్ణయం మంచి నిర్ణయం.పోలీస్ శాఖ పరంగా మేము పూర్తిగా బెల్ట్ షాపుల బంద్ కోసం సహకరిస్తాము.బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని,మీరు ఇన్ఫర్మేషన్ ఇస్తే బెల్ట్ షాపులపై దాడి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో ఉప సర్పంచ్ బోయ సదానందం,పంచాయతీ కార్యదర్శి కె.పద్మజ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుబోయ దేవేందర్,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కడగంచి చలమంద రాజు,సీపీఎం నాయకులు,మాజీ సర్పంచ్ చీరిక సంజీవరెడ్డి,మాజీ ఉపసర్పంచ్ బోయ అంబేద్కర్,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బోయ వెంకట్,కాంగ్రెస్ నాయకులు బోయ రామచందర్,మహిళా సంఘం లీడర్లు మాధగోని రమణ,బోయ శైలజ,వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్ రెడ్డి,బోయ హరిత కిరణ్,గుండెపురం ప్రతిభ,నరేష్,బండ శేఖర్,అంతటి సౌజన్య,ప్రవీణ్,రత్నం, శ్రీకాంత్,బాతరాజు వెంకటేష్ మరియు అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధికి,యువత భవిష్యత్తుకు,మహిళల సంక్షేమానికి మద్యం మహమ్మారిని గ్రామం నుండి తరిమికొట్టాలని,అందరూ కలిసికట్టుగా బెల్ట్ షాపుల బంద్ ను అమలు చేయాలని గ్రామసభలో పిలుపునిచ్చారు.

కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత

జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఫిర్యాదుపై స్పందన.. విద్యార్థినుల సమస్యలపై ఆరా

పాఠశాలలో సౌకర్యాలు, ఉపాధ్యాయుల హాజరు, భోజనం నాణ్యతపై పరిశీలన





భువనగిరి, నవంబర్ 7 (తొలి వార్త) యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (మైనారిటీ కేజీబీవీ)ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, విద్యాబోధన, భోజన సౌకర్యాలు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలు, వసతుల పరిస్థితి, ఉపాధ్యాయుల బోధన, ఇతర ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ సమస్యలను కమిషన్ సభ్యురాలికి లిఖితపూర్వకంగా వివరించినట్లు తెలిసింది. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించేందుకు వారితో కలిసి ఆమె భోజనం చేశారు. బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని ఈ తనిఖీ సందర్భంగా స్పష్టమైంది.



యాదాద్రి భువనగిరి జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ సభ్యుడు కొడారి వెంకటేష్ గతంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కమిషన్ సభ్యురాలు గోగుల సరిత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సువర్ణ, బీఆర్‌బీ కో-ఆర్డినేటర్ అనంతలక్ష్మి, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ దశరథ, విద్యార్థినులు పాల్గొన్నారు.

జైకేసారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలి..!

మార్కెట్లో వడ్ల కుప్పలు పేరుకుపోయాయ్

అకాల వర్షాలతో రైతులు అయ్యోమయం



సీపీఎం నాయకుల డిమాండ్ చౌటుప్పల్,నవంబర్07 (తొలివార్త): చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి,సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మార్కెట్లో వడ్ల కుప్పలు...

మార్కెట్లో వడ్ల కుప్పలు నిలువలు పేరుకుపోయాయని,అకాల వర్షాలకు ఇప్పటికే రైతులు నష్టపోయారని అన్నారు.తుఫానుతో అకాల వర్షాలకు రైతులు అయ్యోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పది రోజులు గడుస్తున్నా కాంటాలు లేవు...

అధికార యంత్రాంగం అధికారికంగా ప్రారంభించి పది రోజులు గడుస్తున్నా కాంటాలు ప్రారంభించకపోవడం విద్దూరంగా ఉందని అన్నారు.తక్షణమే జైకేసారం మార్కెట్లో కాంటాలు ప్రారంభించి వడ్ల కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య,సీపీఎం గ్రామ కార్యదర్శి పొట్ట శ్రీనివాస్,సీపీఎం మండల కమిటీ సభ్యులు,పల్లె మధు కృష్ణ,బోదాసు వెంకటేశం వార్డు సభ్యులు పాలమాకుల పుష్ప,రైతులు పాలమకుల జంగయ్య,ధిల్లీ నర్సిరెడ్డి,జిల్లెల్ల చిట్టి,నక్క సత్తమ్మ,బండమీది లక్ష్మమ్మ,దొడ్డి మల్లేశం,తదితరులు పాల్గొన్నారు. వడ్ల కొనుగోలు ఆలస్యం అయితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాన్ని పూర్తిస్థాయిలో నడిపించాలని నాయకులు కోరారు.

గోదావరి పుష్కరాల పనులకు 21.42 కోట్లు మంజూరు చేయించిన

ఎమ్మెల్యే ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి జిల్లా నవంబర్ 7(తొలి వార్త) 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని పినపాక నియోజకవర్గ పరిధిలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రూ.21.42 కోట్ల నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించడంలో పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే,ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు కృషి చేశారు.గోదావరి పుష్కరాలు అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు గోదావరి నదికి తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ప్రణాళికతో నియోజకవర్గంలోని పుష్కర ఘాట్లు, స్నాన ఘట్టాలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు.ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా పుష్కర ఘాట్ల ఆధునీకరణ, అవసరమైన మరమ్మతులు, స్నాన ఘట్టాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, రోడ్ల విస్తరణతో పాటు భక్తుల రాకపోకలకు అనువుగా మౌలిక వసతులు కల్పించేందుకు మొత్తం రూ.21 కోట్ల 42 లక్షల నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాల శాఖల ద్వారా చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే పుష్కరాలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం, సురక్షితంగా స్నానాలు ఆచరించేందుకు అనువైన ఏర్పాట్లు చేయడం, ఘాట్లకు చేరుకునే రహదారులను అభివృద్ధి చేయడం వంటి పనులకు,ఈ,నిధులను, వినియోగించనున్నారు. పుష్కరాల ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులను పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని,స్పష్టం,చేశారు.పినపాక నియోజకవర్గంలో గోదావరి నది పరివాహక ప్రాంతాలకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పుష్కరాల కోసం ముందుగానే భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయించడం పట్ల పినపాక నియోజకవర్గం లోని ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలో పుష్కరాల అభివృద్ధి పనులకు మరింత ఊతం లభించడంతో పాటు భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే శాశ్వత మౌలిక సదుపాయాలు, అందుబాటులోకి రానున్నాయి.2027 గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టి, పినపాక నియోజకవర్గానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముందుకు సాగుతున్నారు.

వలిగొండ రామన్నపేట వ్యవసాయ మార్కెట్

కమిటీ చైర్మన్‌గా పాశం స్వరూప సత్తిరెడ్డి నియామకం

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు.. నూతన చైర్మన్‌కు అభినందనలు



వలిగొండ, నవంబర్ 7 (తొలి వార్త) యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ--రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా పాశం స్వరూప సత్తిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నియమించింది. నియామకంతో వలిగొండ, రామన్నపేట మండలాల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పాశం సత్తిరెడ్డి సుదీర్ఘకాలంగా వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేష సేవలందించారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించిన భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవతో పాశం స్వరూప సత్తిరెడ్డికి ఈ అవకాశం దక్కినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నూతన చైర్మన్‌గా నియమితులైన పాశం స్వరూప సత్తిరెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, పీఏసీఎస్ చైర్మన్ గరిక రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, రెడ్ల రేపాక గ్రామ సర్పంచ్ దేశబోయిన బాలస్వామి యాదవ్, మాజీ సర్పంచ్ మాద లావణ్య, శంకర్ గౌడ్, మహమ్మద్ జానీ పంతంగి శ్రీనివాస్ గుప్తా కందుల నరసింహతో పాటు పలువురు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ నాయకత్వంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందాలని, రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

నిరుపేద కుటుంబం కొండ్రు రవీందర్

వైద్య ఖర్చులకు 2.50 లక్షల ఎల్ఓసీ అందించిన

ఎమ్మెల్యే,ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి జిల్లా నవంబర్ 7(తొలి వార్త) అశ్వాపురం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కూలి పనులు చేసుకుని జీవిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన కొండ్రు రవీందర్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.2 లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు.వైద్య ఖర్చుల కారణంగా ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అర్హులైన బాధితులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొండ్రు రవీందర్‌కు మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీ ద్వారా వైద్య చికిత్సకు ఆర్థికంగా తోడ్పాటు లభించనుందని చెప్పారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని, నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా కొండ్రు రవీందర్ కుటుంబ సభ్యులు వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించినందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని

మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ అధికారులు

శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే కుంభం





భువనగిరి, నవంబర్ 7 (తొలి వార్త) యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని పలువురు పోలీస్ అధికారులు శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీఎస్పీ రవీందర్, బీబీనగర్ సీఐ సూర్య నాయక్, భువనగిరి టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అర్జునయ్య, రూరల్ ఎస్ఐ అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకుండా కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం ఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం, భద్రతాభావం పెంపొందించే విధంగా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

నూతనకల్‌లోఅనుమతులు లేని బాణాసంచా దుకాణాలు

మెయిన్ రోడ్డుపైనే ప్రమాదకర వ్యాపారం

అధిక ధరలకు బాణాసంచా విక్రయాలు

అధికారుల పర్యవేక్షణ ఏది



నూతనకల్. నవంబర్ 07 తొలి వార్త సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో బాణాసంచా దుకాణాలు ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించకుండా మెయిన్ రోడ్డుపైనే బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారిపై టపాసుల విక్రయాలు కొనసాగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాణాసంచా అనేది అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థాలకు సంబంధించిన వ్యాపారం. ఇలాంటి దుకాణాలను ఏర్పాటు చేయాలంటే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందడంతో పాటు అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే నూతనకల్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేదా? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు చేరితే చర్యలు తీసుకోవాలని అధిక రేట్లకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు

చౌటుప్పల్ మున్సిపాలిటీ హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు..!

తంగడిపల్లి 5వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

ఎండి.అస్లాంఖాన్

చౌటుప్పల్, నవంబర్ 07 (తొలివార్త): చౌటుప్పల్ మున్సిపాలిటీ వ్యాప్తంగా హిందూ బంధువులందరికీ తంగడిపల్లి 5వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి అస్లాంఖాన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

చీకటిని తరిమి వెలుగులు నింపే పండుగ...

దీపావళి అంటేనే చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అని,చెడుపై మంచి సాధించిన గెలుపుకు నిదర్శనమని అస్లాంఖాన్ అన్నారు.ప్రతి ఇంట్లో దీపాల వెలుగులతో పాటు ఆనందం,సంతోషం,శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

హిందూ-ముస్లిం సోదరభావానికి ప్రతీక చౌటుప్పల్...

చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎప్పుడూ మతసామరస్యానికి



సోదరభావానికి పెట్టింది పేరని,హిందూ-ముస్లిం సోదరులు కలిసిమెలిసి అన్ని పండుగలను జరుపుకుంటారని ఆయన గుర్తుచేశారు.ఈ దీపావళి కూడా అందరూ కలిసి,ప్రేమాభిమానాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలి...

"ఈ దీపావళి మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి.ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు,సుఖసంతోషాలు కలగాలి.వ్యాపారస్తులకు లాభాలు,రైతులకు మంచి పంటలు, యువతకు ఉజ్వల భవిష్యత్తు రావాలి" అని ఆకాంక్షించారు.

పటాకులు జాగ్రత్తగా కాల్చండి...

దీపావళి సంబరాల్లో భాగంగా పటాకులు కాల్చేటప్పుడు చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, పర్యావరణాన్ని కాపాడుకుంటూ, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 5వ వార్డు తంగడిపల్లితో పాటు చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టుల హక్కుల సాధనే టిడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

సర్కారు వివక్ష పై సమరానికి సిద్ధం కావాలి

రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 07,తొలి వార్త ప్రతి నిధి రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పని చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. అన్ని జిల్లాల్లో టిడబ్ల్యూజేఎఫ్ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ లోని సూరారంలో గల బాబు జగ్జీవన్ రామ్-అంబేద్కర్ భవన్ లో టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాల్గవ మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మామిడి సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం ఉద్యమిస్తుందని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, ఏ ఒక్క పత్రికకు అనుకూలం కాదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టుల కోసమే పుట్టిన టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షం ఉండదని జర్నలిస్టుల పక్షాన సమస్యలపై పోరాడుతుందని అన్నారు. జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం



అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, జర్నలిస్టుల ఇళ్ళస్థలాలు, అక్రెడిటేషన్, హెల్త్ కార్డులు తదితర సంక్షేమ పథకాల సాధనకు పోరాటం చేస్తామని, ఈ పోరాటాలకు జర్నలిస్టులు ఐక్యంగా సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ,రాష్ట్రంలోని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గతంలో సంఘంలో కీలక పదవులు అనుభవించిన కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంఘ ప్రతిష్ఠను దెబ్బతీశారని, ప్రస్తుతం టిడబ్ల్యూజేఎఫ్ ను మళ్లీ బలోపేతం చేసి జర్నలిస్టుల విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంగూరు గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా శివ, ఉపాధ్యక్షులుగా డప్పు రామస్వామి, మంజుల రెడ్డి, దివాకర్, జోగు వెంకట్ ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మచారి, కోశాధికారిగా కొండా సంజీవ కుమార్, సంయుక్త కార్యదర్శిగా శ్రీశైలం, ప్రచార కార్యదర్శిగా మధు, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి, సుస్మిత, సాయిరాజ్, ఆనంద్, కుమార్ గౌడ్, శ్యాం ముదిరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ ఇన్చార్జ్ గా ప్రవీణ్ రాజ్, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా తేజోమూర్తి, జిల్లా కమిటీ ప్రచార కార్యదర్శిగా వీరేష్ ముదిరాజ్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ గా దుర్గారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా శ్యామల వెంకటేష్ తదితరులు నియమితులయ్యారు.ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, జగదీష్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, మేడ్చల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కావాలి మోహన్, కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులు యాకయ్య, సీనియర్ జర్నలిస్టు శివ పార్వతి,స్వప్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టేకుల చెరువు గోడు వినండి

దొంగతనం చేసిన వారిని పట్టుకొని శిక్షించాలి

సర్పంచ్ బొల్ల సైదమ్మ

బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు నవంబర్ 7 (తొలివార్త) బూర్గంపాడు మండల పరిధిలోని టేకుల చెరువు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం రాత్రి తాళాలు పగలగొట్టి దొంగలు గదిలోకి చొరబడి ఫైళ్ళు మొత్తం తిరగేసి 2022 నుండి 2025 వరకు రసీదు పుస్తకాలని దొంగలు ఎత్తుకెళ్లారు. పంచాయతీకి సంబంధించిన రికార్డు ఫైలు ఎత్తకపోవడం జరిగింది. గతంలో గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా రిసిప్ట్ పుస్తకాలని ప్రింట్ చేపించి ఇంటి పన్ను వసూలు చేసిన పరిస్థితి ఉంది.దీనిపైన బూర్గంపాడు ఎంపీడీవో కి టేకులచెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ వారి దృష్టికి తీసుకుపోయిన ఈ సమస్యని పరిష్కారం చేయలేదు అని చెప్పారు. ఎంపీడీవో ఆ గ్రామ పంచాయతీకి పోకుండానే నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ రోజున 4న రాత్రి దొంగతనం చేశారు.



వారికి సంబంధించిన రసీదు బుక్కులు ఫైల్ ని పట్టుకుపోయారు. వాటిపైన వెంటనే ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టి దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసి శిక్షించాలి. ఇది కేవలం గ్రామపంచాయతీ లో సమాచారం తెలిసిన వ్యక్తి దొంగతనం చేసి ఉండొచ్చని సిపిఎం పార్టీ మండల కమిటీ అభిప్రాయం పడుతుంది. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఎవరు దీనికి కారుకులు అనేది అధికారులు తేల్చాలి గతంలో ఆ పంచాయతీలో కార్యదర్శిగా చేసిన వారు అక్కడ పంచాయతీకి సర్పంచ్ కి చెప్పకుండానే అభివృద్ధి పని చేసిన బిల్లు ఫైలు కూడా ఎత్తకపోయిన పరిస్థితి ఉంది. గ్రామ సర్పంచ్ బోళ్ళ సైదమ్మ బూర్గంపాడు ఎంపీడీవో అధికారికి చెప్పి కొన్ని రోజులు తిరిగితే అప్పుడు ఎత్తకు పోయినా ఫైల్ ని సెక్రెటరీ దగ్గర నుండి ఆ బిల్లుకు సంబంధించిన ఫైల్ ని తిరిగి టేకుల చెరువు సర్పంచ్ కి, కార్యదర్శికి అందజేసిన పరిస్థితి ఉంది. గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలని ఎవరు చేశారు అనేదానిమీద టేకులచెరువు సర్పంచ్ అక్కడ ఉన్న సిబ్బందిని అడగడం వల్ల దానికి సంబంధించిన వివరాలు గ్రామ సభలో చెప్పాల్సిన పరిస్థితి కూడా ఉంటుందని ఆఉద్దేశంతోనే ఈ రోజున ఆ రసీదులు రికార్డులను మాయం చేసినట్టుగా కనపడుతుందని సిపిఎం పార్టీ భావిస్తుంది. దానిపైన కలెక్టర్ దొంగతనం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, పాండవుల రామనాథం,ఎస్.కె ఆ బీద,గుంటక కృష్ణ,టేకుల చెరువు శాఖ కార్యదర్శి బోళ్ళ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు

భార్యను హత్య చేసి గోదావరి లో మృతదేహాన్ని పడవేసిన భర్త

పోలీసుల గాలింపు చర్యల్లో మృతదేహం లభ్యం నిందితుడు అరెస్ట్

భద్రాద్రి జిల్లా నవంబర్ 7(తొలి వార్త) కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళ అదృశ్యం కేసులో పోలీసులు కీలక విషయాలను వెలికితీశారు.తేదీ 06.11.2026న గుండారపు స్వరూప తన సోదరి భవాని కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 205/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా భవాని భర్త బోడా నరేందర్ (30), ఏఆర్‌పీసీ-623, గోలియాతండా, టేకులపల్లి మండలం, పోలీసుల విచారణలో తన భార్యను హత్య చేసినట్లు వెల్లడించాడు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, తేదీ 03.11.2026 రాత్రి సుమారు 8 గంటల సమయంలో తన అద్దె ఇంటిలో భార్య భవానిని చేతులతో నులిమి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు నిందితుడు తెలిపాడు. అనంతరం మృతదేహాన్ని తెల్లని సంచిలో ఉంచి తన స్వగ్రామమైన




గోలియాతండాకు తీసుకెళ్లి, తన తండ్రి హరిలాల్ సహాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టినట్లు వెల్లడించాడు.ఆ తర్వాత తేదీ 04.11.2026 రాత్రి సుమారు 11 గంటల సమయంలో తన తండ్రి సహాయంతో మృతదేహాన్ని మోటార్ సైకిల్‌పై భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి నదిలో పడవేసినట్లు విచారణలో తెలిపాడు. నేరానికి సంబంధించిన సాక్ష్యాలను మాయం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు వెల్లడైంది.నిందితుడు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసులు పంచుల సమక్షంలో గోదావరి నదిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి భవాని మృతదేహాన్ని గుర్తించారు.ఈ కేసులో నిందితుడు బోడా నరేందర్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నేరంలో ప్రమేయం ఉన్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, వన్ టౌన్ సీఐ జితేందర్, అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయ్ సింహారెడ్డి, త్రీ టౌన్ ఎస్ఐ రమేష్‌తో, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

చౌటుప్పల్ మండల ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు..

చీకటిని తరిమి వెలుగులు నింపే పండుగ దీపావళి...!

బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు,మల్కాపురం సర్పంచ్

గిర్మటి నిరంజన్ గౌడ్



చౌటుప్పల్,నవంబర్07 (తొలివార్త): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల ప్రజలందరికీ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు,మల్కాపురం గ్రామ సర్పంచ్ గిర్మటి నిరంజన్ గౌడ్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.దీపావళి అంటేనే చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని అన్నారు.ప్రతి ఇంట్లో దీపాల వెలుగులతో పాటు ఆనందం, సంతోషం ,శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ దీపావళి మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకున్నారు. పటాకులు కాల్చేటప్పుడు చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని, పర్యావరణాన్ని కాపాడుకుంటూ సురక్షితంగా పండుగ జరుపుకోవాలని సూచించారు

కొనిజర్ల ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు.



కొనిజర్ల నవంబర్ 07 (తొలివార్త): కొణిజర్ల ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పటల్ నందు తన త్రయోదశ సందర్భంగా ఘనంగా ధర్వీతర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఓ హే వైష్ణవ ఠాగూర్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో చిన్నారులకు స్వర్ణ బిందు క్యాంపు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ శారద సిహెచ్ దుర్గ మల్లేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు సన్నబిందు ప్రసన్న చుక్కలు వేసి ప్రారంభించడం జరిగింది. ఆయుర్వేదిక్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ వైద్యని నారాయణ స్వరూపంగా భావించటం మన సంప్రదాయం ఆ ఆది వైద్యుడే గర్వితరి క్షీరసాగర మదనవేల సాక్షిగా శ్రీహరి అంశంతో శంకు చక్రాలు అమృత శాలం ధరించి ఆది వైద్యుడిగా ఉద్భవించారన్నారు. ప్రపంచంలోనే తొలి శాస్త్ర చికిత్స చేసిన ఘనత ఆయన సొంతం అనాడే దర్వీతర ఇప్పటిలా సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెందక ముందే అత్యధిక వైద్య పరికరాలు అమరక ముందే శస్త్ర చికిత్సలు చేశారని వివరించారు. కార్యక్రమంలో సుమారు వందమంది చిన్నారులకు స్వర్ణ బిందు ప్రసన్న చుక్కలు వేయడం జరిగింది. ఫార్మసిస్ట్ కల్పన యోగా ఇన్స్ట్రక్టర్ నాగేశ్వరరావు సుధారాణి స్టాప్ నర్స్ రజిని ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చామలేడులో ఘనంగా శ్రీ రక్ష ట్రస్ట్ రక్తదాన శిబిరం

35 మంది యువకుల స్వచ్ఛంద రక్తదానం.. ప్రాణదానంలో యువత భాగస్వామ్యం

గుర్రంపోడు, నవంబర్ 07 (తొలివార్త): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం చామలేడు గ్రామంలో శ్రీ రక్ష ట్రస్ట్ నల్లగొండ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చామలేడు గ్రామంతో పాటు కొప్పోలు, చామలోని బావి తదితర పరిసర గ్రామాల



నుంచి యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మొత్తం 35 మంది యువకులు రక్తదానం చేసి మానవతా విలువలను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇస్రో శాస్త్రవేత్త సాయి ధీరజ్ కౌశిక్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అన్నేపర్తి శివాజీ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ శర్మ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడం గొప్ప సేవ అని అన్నారు. సాయి ధీరజ్ కౌశిక్ మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, శ్రీ రక్ష ట్రస్ట్ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దోటి చంద్రమౌళి, వార్డు సభ్యుడు ఆవుల రాంబాబు, రేషన్ డీలర్ పగిళ్ల రమేష్‌తో పాటు సిరాజ్, దాము యాలాద్రి, దోటి శ్రీను, దోటి గణేష్, ఆవుల సైదులు, దాము లింగస్వామి, జక్కుల శివ, మామిళ్ల శ్రీకాంత్, సిలువేరు గోవర్ధన్, ఇటికాల శివాజీ, పల్లెబోయిన శ్రీనాథ్, మామిళ్ల లింగస్వామి, పావుల విజయ్, పగిళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సేవా కార్యక్రమానికి శ్రీ రక్ష ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ యాదవ్, ట్రస్ట్ ప్రతినిధులు హరీష్, రాజు, ప్రదీప్, స్వామి నిర్వాహకులుగా వ్యవహరించారు.

కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం, నవంబర్ 07 (తొలి వార్త) భద్రాచలం పట్టణంలోని రైతు వేదిక వద్ద ఈరోజు భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన 36 చెక్కులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అందజేశారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ వార్డు సభ్యులు, ఎమ్మార్వో రవికుమార్ మీడియా మిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తేనేపల్లి తండాకు అందని రేషన్ షాప్

400 కార్డులున్నా 3.5 కి.మీ. ప్రయాణం.. స్పందించని అధికారులు

గుర్రంపోడు నవంబర్ 07 తొలివార్త: గ్రామ పంచాయతీగా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నప్పటికీ గుర్రంపోడు మండల కేంద్రంలోని తేనేపల్లి తండాకు కనీస రేషన్ సౌకర్యం అందడం లేదు. తండాలో ప్రత్యేక రేషన్ దుకాణం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే గ్రామ పంచాయతీగా ఉన్నప్పటికీ రేషన్ సరుకుల కోసం పొరుగు గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.తేనేపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలో 400కు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. అయినప్పటికీ ప్రత్యేక రేషన్ షాప్ మంజూరు కాకపోవడంతో సుమారు 3.5 కిలోమీటర్ల దూరంలోని తేనేపల్లి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, కూలీలు ఎండనకా, వాననకా ఇంత



దూరం వెళ్లి బియ్యం తీసుకురావడం భారంగా మారింది.తండా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ రజిత జవహర్‌లాల్ ప్రతి నెల తన సొంత ఖర్చులతో ట్రాక్టర్ ఏర్పాటు చేస్తున్నారు. రేషన్ పంపిణీ సమయంలో తండావాసులను తేనేపల్లి గ్రామానికి తీసుకెళ్లి బియ్యం ఇప్పించి తిరిగి గ్రామానికి చేరవేస్తున్నారు. సర్పంచ్ చేస్తున్న ఈ సహకారం వల్ల ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తున్నప్పటికీ, ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని, శాశ్వతంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.తండాలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు అందజేశారు. ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్లుగా ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి తేనేపల్లి తండాలో నూతన రేషన్ దుకాణం మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని సర్పంచ్ రజిత జవహర్‌లాల్, తండా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తండా ప్రజలకు గ్రామంలోనే రేషన్ సరుకులు అందేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

7- ఎ,సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభించిన

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





భద్రాచలం, నవంబర్ 07 (తొలి వార్త) భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7- ఎ, సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి స్వాగతం పలికారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుకృషి, స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని, పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు, క్రీడాకారులు, అభిమానులు, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మ కార్యక్రమానికి హాజరైనా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్.




కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 07,తొలి వార్త ప్రతి నిధి కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు నారెడ్డి పోలమ్మ భర్త నారెడ్డి నరసింహ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో, ఈరోజు గాజులరామారంలోని పద్మావతి కన్వెన్షన్‌లో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నరసింహ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నా రెడ్డి పోలమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

తాజా వర్షాలతో రికార్డు స్థాయి నీటిమట్టం

కోస్తాంధ్రలో భూగర్భజలాలు పైపైకి

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన రెండు తుపాన్ల వల్ల కురిసిన వర్షాలకు కోస్తాంధ్రలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి.



రాష్ట్రంలో ఇటీవల సంభవించిన రెండు తుపాన్ల వల్ల కురిసిన వర్షాల వల్ల భూగర్భ జలాల పరంగా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కోస్తాంధ్రలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. సగటున 1.14 మీటర్ల మేర నీటిమట్టం పైకి ఉబికినట్లు తాజా లెక్కలు చెబుతున్నాయి. ఎల్‌నినో పరిస్థితుల వల్ల రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతమూ నమోదు కాలేదు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఈ తరుణంలో అర్నబ్, మురసు తుపాన్లు ఒకవైపు పంట నష్టాన్ని మిగిల్చినా, వర్షపాతం పరంగా, భూగర్భజలాల పరంగా కొంత మేలు చేకూర్చాయి. ఈ రెండు తుపాన్లతో భారీ వర్షాలు కురవడంతో కొన్ని జిల్లాల్లో భూగర్భజలాలు దాదాపు 2 మీటర్లకు మించి పైకి వచ్చాయి. రాయలసీమతో పోల్చితే కోస్తాంధ్రలో ఈ ప్రభావం మెరుగ్గా ఉంది.తగ్గిన వర్షపాత లోటు: తుపాన్లకు ముందు రాష్ట్రంలోని 28 జిల్లాల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉండేది. కేవలం ఒక్క జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. ఒక జిల్లాలో అతి తీవ్ర లోటు వర్షపాతం ఉండగా, 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అయితే అర్నబ్, మురసు తుపాన్ల తర్వాత పరిస్థితుల్లో పెను మార్పులు వచ్చాయి. ప్రస్తుతం జిల్లాల వారీగా సగటు వర్షపాతం లెక్కలను పరిశీలిస్తే, 16 జిల్లాల్లో సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మరో 12 జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతమే కొనసాగుతోంది. రాష్ట్రంలో ఇంతకుముందు సగటున 39.4% లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం అది 23.9 శాతానికి తగ్గింది.తాజా వర్షాలతో కోస్తాంధ్రలోని 4 జిల్లాల్లో భూగర్భజలాలు దాదాపు రెండు మీటర్లకు పైగా పెరిగాయి. ఏలూరు జిల్లాలో 2.27 మీటర్ల పెరుగుదలతో అగ్రస్థానంలో నిలవగా, అనకాపల్లిలో 2.05 మీటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2.03 మీటర్లు, శ్రీకాకుళంలో 1.93 మీటర్ల మేర పెరుగుదల నమోదైంది. కోస్తాలో కేవలం మార్కాపురం జిల్లాలో మాత్రమే ఎటువంటి సానుకూల ప్రభావం లేదు. అక్కడ తుపాను ముందుకు, ఇప్పటికీ మధ్య 0.46 మీటర్ల మేర భూగర్భజలాల్లో తగ్గుదల కనిపించింది.మరోవైపు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ, అదీ కొన్నిసెంటిమీటర్ల మేర మాత్రమే ప్రభావం చూపించింది. అక్కడ అన్నమయ్య జిల్లాలో 0.49 మీటర్లు, తిరుపతిలో 0.41 మీటర్లు, చిత్తూరులో 0.38 మీటర్ల మేర మాత్రమే పెరుగుదల కనిపించింది. ఈ తాజా వర్షాలు రాబోయే కాలంలో సాగు, తాగునీటి ఇబ్బందులను దూరం చేయనున్నాయి.

హైదరాబాద్‌లో అడుగంటుతున్న భూగర్భ జలాలు

తాగునీటి లభ్యతపై ఆందోళన!

హైదరాబాద్‌లో భారీగా పడిపోతున్న భూగర్భ జల మట్టాలు

వర్షాభావ పరిస్థితులతో తీవ్రమవుతున్న నీటి ఎద్దడి

రికార్డు స్థాయిలో 153% పెరిగిన వాటర్ ట్యాంకర్ల డిమాండ్

గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే 7 మీటర్లకు పైగా తగ్గిన నీటి మట్టం

కూకట్‌పల్లిలో అత్యధికంగా 22 మీటర్ల లోతుకు పడిపోయిన జలాలు



భాగ్యనగరానికి నీటి గండం పొంచి ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల మున్సిపల్ ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయిలో పడిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, బోరుబావులపై ఆధారపడటం పెరగడంతో రాబోయే నెలల్లో తాగునీటి లభ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ భూగర్భ జల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబర్, అక్టోబర్ నెలల మధ్య కేవలం ఒక్క నెలలోనే నగరంలో సగటు భూగర్భ జల మట్టం 1.01 మీటర్ల మేర పడిపోయింది.భూగర్భ జల శాఖ అక్టోబర్ నివేదిక ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ (+ఎవీజ), సైబరాబాద్ (జవీజ), మల్కాజ్‌గిరి (వీవీజ) కార్పొరేషన్ల పరిధిలో సెప్టెంబర్‌లో భూమికి 11.58 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం, అక్టోబర్ నాటికి 12.59 మీటర్లకు పడిపోయింది. గతేడాది అక్టోబర్ 2025లో ఇదే ప్రాంతంలో సగటు నీటి మట్టం కేవలం 5.42 మీటర్ల లోతులోనే ఉండగా, ఈ ఏడాది ఏకంగా 7.17 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలోని 46 మండలాల్లో 107 పీజోమీటర్ల ద్వారా ఈ వివరాలను సేకరించినట్లు 'ది హిందూ' తన కథనంలో పేర్కొంది.నగరంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కూకట్‌పల్లిలో అత్యధికంగా 22.88 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోగా, శంకర్‌పల్లిలో 21.81 మీటర్లు, మేడిపల్లిలో 20.31 మీటర్ల లోతులో నమోదైంది. అమీర్‌పేట, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, పటాన్‌చెరు, ఉప్పల్ వంటి ప్రాంతాల్లోనూ నీటి మట్టాలు 15 మీటర్లకు పైగా లోతుకు చేరాయి.ఈ దుస్థితికి ప్రధాన కారణం వర్షాభావమే. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు హైదరాబాద్ పట్టణ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 729 మి.మీ. కాగా, కేవలం 484 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. ఇది సుమారు 34% లోటు. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు వాటర్ ట్యాంకర్లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (ఎఅక్టోబర్ 2025లో 87,056 ట్యాంకర్లను సరఫరా చేయగా, ఈ ఏడాది అక్టోబర్‌లో ఆ సంఖ్య 2,20,887కి చేరింది. ఇది సుమారు 153.7% పెరుగుదల.ఈ నేపథ్యంలో, అక్రమ బోరుబావులపై హైడ్రా చర్యలు చేపట్టింది. మరోవైపు, నీటి వృథాను అరికట్టేందుకు 'పానీ' అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. "ప్రతి ఒక్కరూ రోజుకు 20 నుంచి 25 లీటర్ల నీటిని ఆదా చేస్తే, మన కార్యకలాపాలకు ఆటంకం లేకుండా నీటిని పొదుపు చేయవచ్చు" అని ఎవీజొవాదీ మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చీరాలలో 10 స్థానాల్లో గెలుపు.. కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయం: షర్మిల

చీరాల మున్సిపాలిటీలో 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయం

42 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్.. చాలా చోట్ల రెండో స్థానంలో నిలిచిన పార్టీ

ఆమంచి కృష్ణమోహన్ కృషిని ప్రశంసించిన పీసీసీ చీఫ్ షర్మిల

పీఠం దక్కకపోయినా ఇది నైతిక విజయమన్న షర్మిల

కూటమి నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని వార్డు సభ్యులకు సూచన




చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశంసించారు. ఈ ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.44 స్థానాల్లో భాగంగా కాంగ్రెస్ 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. వారిలో 10 మందిని గెలిపించడంతో పాటు, మిగతా స్థానాల్లోనూ పార్టీని రెండో స్థానంలో నిలబెట్టడంలో ఆమంచి ప్రత్యక్షంగా కృషి చేశారని షర్మిల పేర్కొన్నారు."కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థుల గెలుపు మీ కష్టానికి దక్కిన ప్రతిఫలం. స్థానికంగా ప్రజా సమస్యలపై మీ అకుంఠిత పోరాట పటిమకు నిదర్శనం" అని ఆమె అన్నారు. చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం నిజమైన ప్రజాస్వామ్య విజయమని, రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయమనడానికి ఇదొక సంకేతమని ఆమె వ్యాఖ్యానించారు.ప్రజల గొంతుకను నొక్కిపట్టాలని చూసిన కూటమి శక్తులను ఎదురించి, అధికార బలాన్ని తట్టుకుని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజా పక్షాన నిలిచి గెలిచిన వార్డు సభ్యులను షర్మిల అభినందించారు. అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓటేసిన చీరాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయినా, గౌరవప్రదమైన స్థానాలు దక్కించుకుని ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్న కాంగ్రెస్‌దే చీరాలలో అసలైన నైతిక విజయమని ఆమె అన్నారు. చీరాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టేలా అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆమె సూచించారు. గెలుపొందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు అంకితభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నట్లు షర్మిల తెలిపారు.

ధరణి అక్రమాలపై సీఐడీ విచారణ!

15 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు

ధరణి పోర్టల్ అక్రమాలపై తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్‌ను చేపట్టింది

15 బృందాలను ఏకకాలంలో రంగంలోకి దింపి పలుచోట్ల విస్తృత తనిఖీలు చేపట్టింది



తెలంగాణలో ధరణి పోర్టల్ భూ రికార్డుల అక్రమాల వ్యవహారంపై సీఐడీ తన దర్యాప్తును వేగవంతం చేసింది. ఈకేసులో తాజాగా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదివరకే నలుగురిని అరెస్ట్ చేసిన సీఐడీ, తాజా చర్యలతో ఈ కేసులో ఇప్పటివరకు బాధ్యులైన తొమ్మిది మందిపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లయింది. ధరణి అక్రమాల గుట్టు రట్టు చేసేందుకు సీఐడీ అధికారులు రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఇందుకోసం 15 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, గజ్వేల్ తదితర కీలక ప్రాంతాల్లో ఈ సోదాలు సాగాయి. ధరణి పోర్టల్ రోజువారీ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లను, డేటా ఎంట్రీ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని సీఐడీ అధికారులు క్షుణ్ణంగా విచారించారు. పోర్టల్‌లోకి అక్రమంగా లాగిన్ అయి, విలువైన భూముల యాజమాన్య హక్కులను మార్చినట్లు సీఐడీ ప్రాథమికంగా ఆధారాలు సేకరించింది. సీఐడీ ప్రాథమిక విచారణ అనంతరం వీరిలో నలుగురి పాత్రపై స్పష్టత రావడంతో వారిని అరెస్టు చేశాయి.ముఖ్యంగా న్యాయస్థానాల్లో ఉన్న కోర్టు కేసులు, కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని రికార్డుల్లో అక్రమ మార్పులు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు, అత్యంత విలువైన భూదాన్ భూములకు అక్రమంగా బైనంబర్లు సృష్టించి, వాటి యాజమాన్య హక్కులను ఇతరులకు కట్టబెట్టిన ఉదంతాలపై సీఐడీ దర్యాప్తు బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. అయితే ఈ ఆపరేషన్ గురించి సీఐడీ ఉన్నతాధికారులు గోప్యతను పాటిస్తున్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో ఈ అంశానికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశముంది.ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ కోసం సీఐడీ డీజీ చారుసిన్హా నేతృత్వంలో ఏడుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసిన డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లు, పోర్టల్ లాగిన్ హిస్టరీ ఆధారంగా ఈ కమిటీ దర్యాప్తును వేగవంతం చేసింది. రికార్డుల మార్పు వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారుల చిట్టాను బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. సీఐడీ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుండటంతో ఈ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు, అక్రమార్కుల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఏ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఎవరు, ఎక్కడ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యారు ఎలాంటి మార్పులు చేశారనే విషయంలో డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ఆడిట్‌లో కనుగొన్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే సీఐడీ తాజా ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కుంభం తక్షణ ఆదేశాలు





వలిగొండ, నవంబర్ 7 (తొలి వార్త) యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వలిగొండలోని తన నివాసంలో శనివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ఇతర ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. ప్రజలు వివరించిన సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విని, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం తన బాధ్యతని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జీడిమెట్ల ఇ ఎస్ ఐ హాస్పిటల్ కార్మికుల సమావేశం

మెడికల్ ఎంప్లాయ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 07,తొలి వార్త ప్రతి నిధి. ఏఐటీయూసీ(అనుబంధం)రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎండీ యూసుఫ్ అధ్యక్షతన నేడు జరవడం. ఈ సమావేశం నకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా మాట్లాడుతూ కార్మికులందరు ఐక్యమత్యం తో సంఘముగా ఏర్పడినప్పుడే మన సమస్యలను సాధించు కుంటాము అని కార్మికులకు రావలసిన మూడు నేలల జీతాలు సదరు కాంట్రాక్టర్ చెల్లించకపోవడం అన్యాయం అని ఇట్టి విషయాన్ని హాస్పిటల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకొస్తామని అన్నారు.ఈ కార్యక్రమలో ఏఐటీయూసీ మేధ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు హరినాథ్ రావ్ లు పాల్గొన్నారు. జీడిమెట్ల ఇ ఎస్ ఐ హాస్పిటల్ ఏఐటీయూసీ కమిటీని ప్రకటిచడం జరిగింది.అధ్యక్షులుగా వాణి, ప్రధాన కార్యదర్శి గిరి, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, షహనాబేగం. సెక్రెటరీలుగా సోని, బాబురావు, చంద్రకళ. కోశాధికారి గా కుమారస్వామి గౌరవ అధ్యక్షులుగా హరినాథరావు, సలహా దారునిగా శ్రీనివాస్ ల ను నిర్ణహించడం జరిగింది.ఇ ఎస్ ఐ కార్మికులు నాగరాజీ, పుష్పలత, శుభాషిణి, రజని, యాదమ్మ, గంగమ్మ, కవిత, సువర్ణ, గిరి, శాంతబాయ్ తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసిన

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 07,తొలి వార్త ప్రతి నిధి. హైదరాబాద్ లోని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా దీపావళి పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ కుక్కే సుబ్రహ్మణ్య స్వామి వారి ప్రసాదాని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ బీఆర్ఎస్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్, పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, బీఆర్ఎస్ యువ నాయకులు శ్రీశైలం యాదవ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు!

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

బాణాసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించండి-ప్రభాకర్ రెడ్డి పిలుపు

మునుగోడు,నవంబర్7 (తొలివార్త): మునుగోడు నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు,ఆనందం,సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

దీపావళి అంటేనే వెలుగుల పండుగ...

దీపావళి అంటే చీకటిపై వెలుగు సాధించిన విజయానికి,చెడుపై మంచి సాధించిన గెలుపుకు ప్రతీక అని ప్రభాకర్ రెడ్డి అన్నారు.ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని,ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండలాలు,గ్రామాల ప్రజలు,రైతులు, యువత, మహిళలు,వ్యాపారస్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ పేరుపేరునా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు,యువతకు ప్రత్యేక శుభాకాంక్షలు...

రైతులకు మంచి పంటలు రావాలని,వ్యాపారస్తులకు లాభాలు రావాలని,యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని,విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు.మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.

బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు-తప్పనిసరిగా పాటించండి:

దీపావళి సంబరాల్లో భాగంగా బాణాసంచా కాల్చేటప్పుడు ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ప్రభాకర్ రెడ్డి సూచించారు.చిన్నపిల్లలను ఒంటరిగా పటాకులు కాల్చనివ్వవద్దు.పెద్దల పర్యవేక్షణలోనే కాల్చాలి.ఇళ్ళలో,గడ్డివాముల దగ్గర,పెట్రోల్ బంకుల దగ్గర పటాకులు కాల్చవద్దు.చేతిలో పట్టుకుని పటాకులు కాల్చవద్దని,వృద్ధులుగుండె జబ్బులు ఉన్నవారు,ఆస్తమా రోగులు శబ్దం ఎక్కువగా ఉండే పటాకులకు దూరంగా ఉండాలి.పశువులు, పెంపుడు జంతువులను భయపెట్టవద్దు.వాటికిదూరంగా పటాకులు కాల్చాలి.కాలిన గాయాలైతే వెంటనే చల్లని నీళ్ళతో కడిగి,డాక్టర్ ను సంప్రదించాలి.పర్యావరణాన్ని కాపాడుకుంటూ,శబ్ద కాలుష్యం తక్కువగా ఉండేలా పండుగ జరుపుకోవాలి.

అందరూ కలిసి జరుపుకుందాం...


మునుగోడు నియోజకవర్గంలో హిందూ,ముస్లిం,క్రిస్టియన్ సోదరులందరూ కలిసిమెలిసి అన్ని పండుగలను జరుపుకుంటారని,ఈ దీపావళి కూడా మతసామరస్యానికి,సోదరభావానికి ప్రతీకగా నిలవాలని ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ సురక్షితంగా,ఆనందంగా దీపావళి జరుపుకోవాలని,ఈ దీపావళి మీ జీవితాల్లో వెలుగులు నింపాలని మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com

తాజా వర్షాలతో రికార్డు స్థాయి నీటిమట్టం

కోస్తాంధ్రలో భూగర్భజలాలు పైపైకి

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన రెండు తుపాన్ల వల్ల కురిసిన వర్షాలకు కోస్తాంధ్రలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి.



రాష్ట్రంలో ఇటీవల సంభవించిన రెండు తుపాన్ల వల్ల కురిసిన వర్షాల వల్ల భూగర్భ జలాల పరంగా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కోస్తాంధ్రలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. సగటున 1.14 మీటర్ల మేర నీటిమట్టం పైకి ఉబికినట్లు తాజా లెక్కలు చెబుతున్నాయి. ఎల్‌నినో పరిస్థితుల వల్ల రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతమూ నమోదు కాలేదు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఈ తరుణంలో అర్నబ్, మురసు తుపాన్లు ఒకవైపు పంట నష్టాన్ని మిగిల్చినా, వర్షపాతం పరంగా, భూగర్భజలాల పరంగా కొంత మేలు చేకూర్చాయి. ఈ రెండు తుపాన్లతో భారీ వర్షాలు కురవడంతో కొన్ని జిల్లాల్లో భూగర్భజలాలు దాదాపు 2 మీటర్లకు మించి పైకి వచ్చాయి. రాయలసీమతో పోల్చితే కోస్తాంధ్రలో ఈ ప్రభావం మెరుగ్గా ఉంది.తగ్గిన వర్షపాత లోటు: తుపాన్లకు ముందు రాష్ట్రంలోని 28 జిల్లాల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉండేది. కేవలం ఒక్క జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. ఒక జిల్లాలో అతి తీవ్ర లోటు వర్షపాతం ఉండగా, 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అయితే అర్నబ్, మురసు తుపాన్ల తర్వాత పరిస్థితుల్లో పెను మార్పులు వచ్చాయి. ప్రస్తుతం జిల్లాల వారీగా సగటు వర్షపాతం లెక్కలను పరిశీలిస్తే, 16 జిల్లాల్లో సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మరో 12 జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతమే కొనసాగుతోంది. రాష్ట్రంలో ఇంతకుముందు సగటున 39.4% లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం అది 23.9 శాతానికి తగ్గింది.తాజా వర్షాలతో కోస్తాంధ్రలోని 4 జిల్లాల్లో భూగర్భజలాలు దాదాపు రెండు మీటర్లకు పైగా పెరిగాయి. ఏలూరు జిల్లాలో 2.27 మీటర్ల పెరుగుదలతో అగ్రస్థానంలో నిలవగా, అనకాపల్లిలో 2.05 మీటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2.03 మీటర్లు, శ్రీకాకుళంలో 1.93 మీటర్ల మేర పెరుగుదల నమోదైంది. కోస్తాలో కేవలం మార్కాపురం జిల్లాలో మాత్రమే ఎటువంటి సానుకూల ప్రభావం లేదు. అక్కడ తుపాను ముందుకు, ఇప్పటికీ మధ్య 0.46 మీటర్ల మేర భూగర్భజలాల్లో తగ్గుదల కనిపించింది.మరోవైపు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ, అదీ కొన్నిసెంటిమీటర్ల మేర మాత్రమే ప్రభావం చూపించింది. అక్కడ అన్నమయ్య జిల్లాలో 0.49 మీటర్లు, తిరుపతిలో 0.41 మీటర్లు, చిత్తూరులో 0.38 మీటర్ల మేర మాత్రమే పెరుగుదల కనిపించింది. ఈ తాజా వర్షాలు రాబోయే కాలంలో సాగు, తాగునీటి ఇబ్బందులను దూరం చేయనున్నాయి.

హైదరాబాద్‌లో అడుగంటుతున్న భూగర్భ జలాలు

తాగునీటి లభ్యతపై ఆందోళన!

హైదరాబాద్‌లో భారీగా పడిపోతున్న భూగర్భ జల మట్టాలు

వర్షాభావ పరిస్థితులతో తీవ్రమవుతున్న నీటి ఎద్దడి

రికార్డు స్థాయిలో 153% పెరిగిన వాటర్ ట్యాంకర్ల డిమాండ్

గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే 7 మీటర్లకు పైగా తగ్గిన నీటి మట్టం

కూకట్‌పల్లిలో అత్యధికంగా 22 మీటర్ల లోతుకు పడిపోయిన జలాలు



భాగ్యనగరానికి నీటి గండం పొంచి ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల మున్సిపల్ ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయిలో పడిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, బోరుబావులపై ఆధారపడటం పెరగడంతో రాబోయే నెలల్లో తాగునీటి లభ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ భూగర్భ జల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబర్, అక్టోబర్ నెలల మధ్య కేవలం ఒక్క నెలలోనే నగరంలో సగటు భూగర్భ జల మట్టం 1.01 మీటర్ల మేర పడిపోయింది.భూగర్భ జల శాఖ అక్టోబర్ నివేదిక ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ (+ఎవీజ), సైబరాబాద్ (జవీజ), మల్కాజ్‌గిరి (వీవీజ) కార్పొరేషన్ల పరిధిలో సెప్టెంబర్‌లో భూమికి 11.58 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం, అక్టోబర్ నాటికి 12.59 మీటర్లకు పడిపోయింది. గతేడాది అక్టోబర్ 2025లో ఇదే ప్రాంతంలో సగటు నీటి మట్టం కేవలం 5.42 మీటర్ల లోతులోనే ఉండగా, ఈ ఏడాది ఏకంగా 7.17 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలోని 46 మండలాల్లో 107 పీజోమీటర్ల ద్వారా ఈ వివరాలను సేకరించినట్లు 'ది హిందూ' తన కథనంలో పేర్కొంది.నగరంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కూకట్‌పల్లిలో అత్యధికంగా 22.88 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోగా, శంకర్‌పల్లిలో 21.81 మీటర్లు, మేడిపల్లిలో 20.31 మీటర్ల లోతులో నమోదైంది. అమీర్‌పేట, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, పటాన్‌చెరు, ఉప్పల్ వంటి ప్రాంతాల్లోనూ నీటి మట్టాలు 15 మీటర్లకు పైగా లోతుకు చేరాయి.ఈ దుస్థితికి ప్రధాన కారణం వర్షాభావమే. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు హైదరాబాద్ పట్టణ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 729 మి.మీ. కాగా, కేవలం 484 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. ఇది సుమారు 34% లోటు. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు వాటర్ ట్యాంకర్లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (ఎజబ్ల్యూ) అక్టోబర్ 2025లో 87,056 ట్యాంకర్లను సరఫరా చేయగా, ఈ ఏడాది అక్టోబర్‌లో ఆ సంఖ్య 2,20,887కి చేరింది. ఇది సుమారు 153.7% పెరుగుదల.ఈ నేపథ్యంలో, అక్రమ బోరుబావులపై హైడ్రా చర్యలు చేపట్టింది. మరోవైపు, నీటి వృథాను అరికట్టేందుకు 'పానీ' అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. "ప్రతి ఒక్కరూ రోజుకు 20 నుంచి 25 లీటర్ల నీటిని ఆదా చేస్తే, మన కార్యకలాపాలకు ఆటంకం లేకుండా నీటిని పొదుపు చేయవచ్చు" అని ఎవీజబోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చీరాలలో 10 స్థానాల్లో గెలుపు.. కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయం: షర్మిల

చీరాల మున్సిపాలిటీలో 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయం

42 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్.. చాలా చోట్ల రెండో స్థానంలో నిలిచిన పార్టీ

ఆమంచి కృష్ణమోహన్ కృషిని ప్రశంసించిన పీసీసీ చీఫ్ షర్మిల

పీఠం దక్కకపోయినా ఇది నైతిక విజయమన్న షర్మిల

కూటమి నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని వార్డు సభ్యులకు సూచన




చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశంసించారు. ఈ ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.44 స్థానాల్లో భాగంగా కాంగ్రెస్ 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. వారిలో 10 మందిని గెలిపించడంతో పాటు, మిగతా స్థానాల్లోనూ పార్టీని రెండో స్థానంలో నిలబెట్టడంలో ఆమంచి ప్రత్యక్షంగా కృషి చేశారని షర్మిల పేర్కొన్నారు."కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థుల గెలుపు మీ కష్టానికి దక్కిన ప్రతిఫలం. స్థానికంగా ప్రజా సమస్యలపై మీ అకుంఠిత పోరాట పటిమకు నిదర్శనం" అని ఆమె అన్నారు. చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం నిజమైన ప్రజాస్వామ్య విజయమని, రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయమనడానికి ఇదొక సంకేతమని ఆమె వ్యాఖ్యానించారు.ప్రజల గొంతుకను నొక్కిపట్టాలని చూసిన కూటమి శక్తులను ఎదురించి, అధికార బలాన్ని తట్టుకుని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజా పక్షాన నిలిచి గెలిచిన వార్డు సభ్యులను షర్మిల అభినందించారు. అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓటేసిన చీరాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయినా, గౌరవప్రదమైన స్థానాలు దక్కించుకుని ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్న కాంగ్రెస్‌దే చీరాలలో అసలైన నైతిక విజయమని ఆమె అన్నారు. చీరాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టేలా అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆమె సూచించారు. గెలుపొందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు అంకితభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నట్లు షర్మిల తెలిపారు.

ధరణి అక్రమాలపై సీఐడీ విచారణ!

15 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు

ధరణి పోర్టల్ అక్రమాలపై తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్‌ను చేపట్టింది

15 బృందాలను ఏకకాలంలో రంగంలోకి దింపి పలుచోట్ల విస్తృత తనిఖీలు చేపట్టింది



తెలంగాణలో ధరణి పోర్టల్ భూ రికార్డుల అక్రమాల వ్యవహారంపై సీఐడీ తన దర్యాప్తును వేగవంతం చేసింది. ఈకేసులో తాజాగా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదివరకే నలుగురిని అరెస్ట్ చేసిన సీఐడీ, తాజా చర్యలతో ఈ కేసులో ఇప్పటివరకు బాధ్యులైన తొమ్మిది మందిపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లయింది. ధరణి అక్రమాల గుట్టు రట్టు చేసేందుకు సీఐడీ అధికారులు రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఇందుకోసం 15 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, గజ్వేల్ తదితర కీలక ప్రాంతాల్లో ఈ సోదాలు సాగాయి. ధరణి పోర్టల్ రోజువారీ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లను, డేటా ఎంట్రీ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని సీఐడీ అధికారులు క్షుణ్ణంగా విచారించారు. పోర్టల్‌లోకి అక్రమంగా లాగిన్ అయి, విలువైన భూముల యాజమాన్య హక్కులను మార్చినట్లు సీఐడీ ప్రాథమికంగా ఆధారాలు సేకరించింది. సీఐడీ ప్రాథమిక విచారణ అనంతరం వీరిలో నలుగురి పాత్రపై స్పష్టత రావడంతో వారిని అరెస్టు చేశాయి.ముఖ్యంగా న్యాయస్థానాల్లో ఉన్న కోర్టు కేసులు, కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని రికార్డుల్లో అక్రమ మార్పులు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు, అత్యంత విలువైన భూదాన్ భూములకు అక్రమంగా బైనంబర్లు సృష్టించి, వాటి యాజమాన్య హక్కులను ఇతరులకు కట్టబెట్టిన ఉదంతాలపై సీఐడీ దర్యాప్తు బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. అయితే ఈ ఆపరేషన్ గురించి సీఐడీ ఉన్నతాధికారులు గోప్యతను పాటిస్తున్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో ఈ అంశానికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశముంది.ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ కోసం సీఐడీ డీజీ చారుసిన్హా నేతృత్వంలో ఏడుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసిన డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లు, పోర్టల్ లాగిన్ హిస్టరీ ఆధారంగా ఈ కమిటీ దర్యాప్తును వేగవంతం చేసింది. రికార్డుల మార్పు వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారుల చిట్టాను బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. సీఐడీ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుండటంతో ఈ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు, అక్రమార్కుల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఏ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఎవరు, ఎక్కడ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యారు ఎలాంటి మార్పులు చేశారనే విషయంలో డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ఆడిట్‌లో కనుగొన్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే సీఐడీ తాజా ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం.

సింహాచలంలో సంప్రదాయ దుస్తులు తప్పనిసరి

ఈవో కీలక ప్రకటన

సింహాచలం ఆలయంలో కొత్త డ్రెస్ కోడ్ అమలు

నిక్కర్లు, టీ షర్టులు ధరిస్తే ఆలయంలోకి అనుమతి లేదన్న ఈవో

ఆలయ పవిత్రత కోసమే ఈ నిర్ణయమన్న ఈవో

నరక చతుర్దశి రోజున సాయంత్రం 6 గంటల వరకే దర్శనం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులకు నూతన వస్త్ర నిబంధనలు (డ్రెస్‌కోడ్) అమల్లోకి వచ్చాయి. ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల్లోనే రావాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) జల్లేపల్లి వెంకట్రావు స్పష్టం చేశారు.నూతన నిబంధనల ప్రకారం, పురుషులు పంచె-కండువా లేదా కుర్తా-పైజామా ధరించాలి. ఫార్మల్ ప్యాంట్, షర్ట్ ధరించిన వారిని కూడా అనుమతిస్తారు. మహిళలు చీర, లంగా- ఓణీ లేదా చుడీదార్‌తో పాటు తప్పనిసరిగా దుపట్టా ధరించాల్సి ఉంటుంది. షార్ట్స్ (నిక్కర్లు), టీ-షర్టులు, స్లీవ్‌లెస్ టాప్స్ వంటి ఆధునిక పాశ్చాత్య దుస్తులు ధరించిన వారిని ఆలయ ప్రాంగణంలోకి అనుమతించబోమని అధికారులు తేల్చిచెప్పారు. ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులకు సైతం ఈ నిబంధనలే వర్తిస్తాయని తెలిపారు.ఆలయ పవిత్రతను కాపాడటంతో పాటు, సనాతన ధర్మ సంప్రదాయాలను పరిరక్షించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో వెంకట్రావు వివరించారు. ఈ కొత్త నిబంధనలపై భక్తులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, నవంబర్ 8, ఆదివారం నరక చతుర్దశి, స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక హోమాలు జరగనున్నాయి. ఆ రోజున సాయంత్రం 6 గంటల వరకే భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం ఉంటుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

హైదరాబాద్‌లో స్నేహం పేరుతో మోసం

కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ

స్నేహితురాలిని నమ్మించి ఆమె పిన్ని ఇంట్లో భారీ చోరీ

నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు

సుమారు అరకిలో బంగారం, మూడు కిలోల వెండి అపహరణ

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు... బంగారం, నగదు స్వాధీనం

స్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యువకుడు, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా అర కిలోకు పైగా బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి భారీగా బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థినిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు.గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

అప్రమత్తతతోనే ఆనంద దీపావళి

టపాసులు కాల్చేటప్పుడు ఈ జాగ్రత్తలు మేలు

దీపావళి పండుగకు టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు



దీపావళి పండుగ రానే వచ్చింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చుతూ ఆనందంగా వేడుక చేసుకునేందుకు చాలా మంది నగరవాసులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే బాణాసంచాతో కళ్ల భద్రతపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ నవ్య చెరుకూరి తెలిపారు.టపాసులు కాల్చేటప్పుడు కంటి భద్రత, ప్రథమ చికిత్స గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. దీపావళి పండుగ రోజు 24 గంటల పాటు పని చేసేలా ఎల్వీప్రసాద్ ఐ ఆస్పత్రితో పాటు, సరోజినిదేవి కంటి ఆసుపత్రిలో కూడా అత్యవసర విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు.బాణాసంచాతో (టపాసులు) సంభవించే కంటి గాయాలు తొలుత చిన్నవిగా కనిపించినప్పటికీ కొన్నిసార్లు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని డాక్టర్ నవ్య చెరుకూరి తెలిపారు. కార్నియా పూర్తిగా దెబ్బ తినడం, కంటి లోపల రక్తస్రావం, గాయం కారణంగా వచ్చే శుక్లాలు (ట్రూమాటిక్ క్యాటరాక్ట్), రెటీనా దెబ్బ తినడం లాంటి తీవ్ర పరిమాణాలు ఎదురవుతాయన్నారు. శాశ్వతంగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం సైతం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.బాణాసంచా కాల్చే సమయంలో తప్పనిసరిగా కళ్లద్దాలు (ఐ షీల్డ్) ధరించడం ఉత్తమం. చేతిలో పట్టుకొని కాల్చడం, సీసాలు, డబ్బాల కింద పెట్టి పేల్చడం లాంటి పనులు చేయకూడదు. సింథటిక్ దుస్తులకు బదులు వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.పిల్లలు బాణాసంచా కాల్చేటపుడు పెద్దలు తప్పకుండా వారి దగ్గరే ఉండి పర్యవేక్షించడం మంచిది. విశాలమైన బహిరంగ ప్రదేశాల్లో బాణాసంచా కాల్చాలి. నీళ్లు, ఇసుకతో నింపిన బకెట్లను పక్కన పెట్టుకోవాలి. గుర్తింపు పొందిన వారి నుంచే బాణాసంచాను కొనుగోలు చేసి, వాటిని బాగా ఎండబెట్టి ఉపయోగించాలి.బాణాసంచాకు బదులుగా సంప్రదాయ ప్రమిదలు, ఎల్ఈడీ దీపాలతో పండుగ చేసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.గ్యాస్ సిలిండర్లు, ఇతర మండే స్వభావం ఉన్న వస్తువులను దూరంగా, కార్డ్‌బోర్డ్ పెట్టెల్లో భద్రపరచాలి.కంటికి గాయమైనప్పుడు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచించారు. కంటిలో నలుసు పడినట్లయితే శుభ్రమైన నీటితో సున్నితంగా కడగాలి. కంట్లో ఏదైనా ఇరుక్కుంటే చేయి పెట్టి తీయకూడదు. గాయపడిన కంటి భాగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రుద్దడం, నలపడం చేయకూడదు. వైద్యుల సలహా లేకుండా కంటిలో చుక్కలు, పసుపు, ఆయింట్‌మెంట్లు లాంటివి పూయవద్దు.వెంటనే సమీపంలో ఉన్న నేత్ర వైద్య నిపుణుడి దగ్గరికి, ఆస్పత్రిలో చేర్పించాలి. త్వరితగతిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తేనే ప్రాణప్రదమైన కంటి చూపును కాపాడుకోవచ్చు. సొంత వైద్యం ఎట్టి పరిస్థితిలో పనికిరాదు. చికిత్స ఆలసమయ్యే కొద్దీ కంటి చూపుపై ఆ తీవ్రత పెరుగుతుందని గమనించాలి. వివరాల కోసం ఎల్వీప్రసాద్ నేత్ర వైద్యశాల సహాయ కేంద్రాల నంబరు- 04068102100/04068102848/7331129653 సంప్రదించవచ్చు.

చలికాలంలో వ్యాయామం చేసే ముందు ఏ ఆహారం అయితే ఉత్తమం.. నిపుణులు ఏం సూచిస్తున్నారు..?



కబురు న్యూస్, ఆరోగ్యం, నవంబర్ 6 : చలికాలంలో ఉదయం నిద్రలేచి వ్యాయామశాలకు వెళ్లడం కొంత కష్టంగా అనిపిస్తుంది. వ్యాయామానికి ముందు త్వరగా శక్తి రావాలనే ఉద్దేశంతో కొందరు కెఫీన్ కలిగిన పానీయాలు తీసుకుంటే, మరికొందరు సహజమైన పానీయాలను ఎంచుకుంటారు. అయితే వ్యాయామానికి సిద్ధం కావడానికి ఉత్ప్రేరకాలు కలిగిన ప్రత్యేక పానీయాలు తప్పనిసరి కాదు. అరటిపండు, పాలు, కొబ్బరినీళ్లు, పండ్ల రసం, ఓట్స్‌తో తయారుచేసిన పానీయాలు శరీరానికి ద్రవాలతోపాటు అవసరమైన పోషకాలను అందిస్తాయి. అయినప్పటికీ, ఏ సహజ పానీయం తాగినా వెంటనే శక్తి వస్తుందని చెప్పలేం. తగినంత నిద్ర, సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం కూడా అంతే ముఖ్యం. చలికాలంలో వ్యాయామానికి ముందు తీసుకోదగిన ఏడు సహజ పానీయాల గురించి పోషకాహార నిపుణులు వివరించారు.

గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, అరటి పండు స్మూతీ..

చలికాలంలో చల్లని నీరు తాగడం ఇష్టం లేనివారికి నిమ్మరసం కలిపిన గోరువెచ్చని నీరు మంచి ఎంపిక. వ్యాయామ సమయంలో శరీర పనితీరు సక్రమంగా ఉండేందుకు తగినంత నీరు అవసరం. నిమ్మరసం నీటికి రుచిని అందిస్తుంది. వ్యాయామానికి 15 నుంచి 30 నిమిషాల ముందు తీసుకోవచ్చు. అలాగే శారీరక శ్రమ సమయంలో శరీరానికి అవసరమైన శక్తిని అందించే ముఖ్యమైన పోషకం పిండి పదార్థాలు. అరటిపండులో ఇవి సమృద్ధిగా ఉంటాయి. కొన్ని గంటలుగా ఆహారం తీసుకోక పోయినా, ఎక్కువ శ్రమతో కూడిన వ్యాయామం చేయబోతున్నా అరటి పండు స్మూతీ ఉపయోగ పడుతుంది. ఒక పండిన అరటిపండును 200 నుంచి 250 మిల్లీలీటర్ల పాలతో కలిపి మిక్సీలో వేసి తయారుచేసుకోవచ్చు. అవసరమైతే కొద్దిగా నీరు కలుపుకోవచ్చు. అదనంగా చక్కెర లేదా పాకం వేయాల్సిన అవసరం లేదు. పూర్తిస్థాయి స్మూతీ తాగిన తర్వాత వ్యాయామానికి 60 నుంచి 90 నిమిషాల సమయం ఇవ్వడం మంచిది.

కొబ్బరి నీళ్లు, బీట్‌రూట్ రసం..

కొబ్బరినీళ్లలో నీటితోపాటు పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. వ్యాయామానికి ముందు తేలికపాటి రుచితో కూడిన పానీయం కావాలనుకునేవారికి ఇది ఒక ఎంపిక. కొంతమేర పిండి పదార్థాలను కూడా అందిస్తుంది. చక్కెర కలపని కొబ్బరినీళ్లను చిన్న గ్లాసు తీసుకోవచ్చు. వ్యాయామానికి 30 నుంచి 60 నిమిషాల ముందు తాగవచ్చు. ఉదయం వ్యాయామం చేసేవారు కడుపు నిండుగా ఉండే పానీయం కోరుకుంటే ఓట్స్ స్మూతీని ఎంచుకోవచ్చు. 20 నుంచి 30 గ్రాముల ఓట్స్‌ను 200 నుంచి 250 మిల్లీలీటర్ల పాలతో కలిపి మిక్సీలో వేసుకోవాలి. అదనపు రుచి, పిండి పదార్థాల కోసం సగం అరటిపండు కూడా కలుపుకోవచ్చు. వ్యాయామానికి 60 నుంచి 120 నిమిషాల ముందు దీన్ని తీసుకోవచ్చు. బీట్‌రూట్‌లో సహజంగా ఉండే నైట్రేట్ల కారణంగా క్రీడాకారుల ఆహారంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. శరీరంలో ఈ నైట్రేట్లు నైట్రిక్ ఆక్సైడ్‌గా మారతాయి. ఇది రక్తనాళాల పనితీరులో కీలక పాత్ర పోషిస్తుంది. ఒక చిన్న బీట్‌రూట్‌ను శుభ్రంగా కడిగి నీటితో కలిపి రసం తయారుచేసుకోవచ్చు. రుచి కోసం కొద్దిగా నిమ్మరసం కలపవచ్చు. దీన్ని వ్యాయామానికి 2 గంటల ముందు తీసుకోవాలి.

నారింజ రసం..

నారింజ రసంలో పిండి పదార్థాలు, నీరు ఉంటాయి. వ్యాయామానికి ముందు తాగేందుకు వీలుగా అర గ్లాసు నారింజ రసానికి సమాన పరిమాణంలో నీరు కలుపుకోవచ్చు. ఎక్కువసేపు ఆహారం తీసుకోకుండా ఉన్నప్పుడు లేదా ఎక్కువ సమయం వ్యాయామం చేయబోతున్నప్పుడు ఇది కొంత శక్తిని అందిస్తుంది. వ్యాయామానికి 30 నుంచి 60 నిమిషాల ముందు తాగవచ్చు. అలాగే చలికాలంలో వ్యాయామానికి వెళ్లే ముందు గోరువెచ్చని పాలు తాగడం కొందరికి సౌకర్యంగా ఉంటుంది. పాలతోపాటు చిన్న అరటిపండు తీసుకుంటే ప్రొటీన్, ద్రవాలు, పిండి పదార్థాలు అందుతాయి. ఉదయం నిద్రలేచిన వెంటనే వ్యాయామం చేసేవారికి ఇది తేలికపాటి ఆహారంగా ఉపయోగపడుతుంది.

ఏది తీసుకోవాలి..

ఏ పానీయం తీసుకోవాలనేది చేయబోయే వ్యాయామంపై ఆధారపడి ఉంటుంది. తక్కువ సమయం పాటు సాధారణ వ్యాయామం చేసేవారికి, అంతకుముందు సరైన ఆహారం తీసుకుని ఉంటే నీరు సరిపోతుంది. కొన్ని గంటలుగా ఆహారం తీసుకోకుండా కండరాల బలానికి సంబంధించిన వ్యాయామాలు చేసేవారు అరటిపండు లేదా కొద్దిపాటి అరటిపండు స్మూతీ తీసుకోవచ్చు. ఎక్కువసేపు వ్యాయామం చేసేవారికి అవసరాన్ని బట్టి పిండి పదార్థాలు కలిగిన పానీయం ఉపయోగపడుతుంది. వేడిగా ఉండే పానీయాలను ఇష్టపడేవారు నిమ్మరసం కలిపిన గోరువెచ్చని నీరు లేదా కొద్దిపాటి పాలు తీసుకోవచ్చు. ఎక్కువగా చెమట పట్టే తీవ్రమైన వ్యాయామాల సమయంలో శరీరానికి అవసరమైన ద్రవాలు, ఎలక్ట్రోలైట్లపై దృష్టి పెట్టాలి. ప్రతి సహజ పానీయంలోనూ తగినంత సోడియం ఉంటుందని భావించకూడదు. అయితే ఏ పానీయం తీసుకోవాలనేది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. వ్యక్తిగత అభిరుచులు, శరీర స్థితి, వాతావరణ పరిస్థితులు, చేసే వ్యాయామం, ఉన్న ఆరోగ్య సమస్యలు వంటి అన్ని అంశాలను బేరీజు వేసుకుని అప్పుడు నిర్ణయం తీసుకోవాలి. అవసరం అయితే నిపుణుల సలహా పాటించాలి.

చద్దన్నంతో ఎన్నో ప్రయోజనాలు.... ఛీ చద్దన్నం అని చీప్‌గా తీసిపారేయకండి..!



కబురు న్యూస్, ఆరోగ్యం, నవంబర్ 6 : చాలామంది చద్దన్నం అంటే ఇష్టపడరు. కొందరైతే చద్దన్నం అనే మాట వింటేనే వ్వాక్ అంటారు. అమ్మో చద్దన్నం తినడం నావల్ల కాదు అని చెబుతుంటారు. కానీ ఒక్కసారి చద్దన్నం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకున్నారంటే ఇకపై చద్దన్నం వద్దు అనే మాట మీ నోట రానే రాదు. రాత్రి మిగిలిన అన్నాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో పొద్దున తినడం మాత్రమే కాదు.. రాత్రికి మిగలేలా అన్నం వండుకుని మరీ ఉదయాన్నే చద్దన్నం తింటారు. చద్దన్నంలో అంత గొప్ప తనం ఏముంది అనుకుంటున్నారా..? అయితే వివరాల్లోకి వెళ్దాం పదా..?

చద్దన్నంతో ఎన్ని లాభాలుంటాయో ఇటీవల అమెరికన్ న్యూట్రిషియన్ అసోసియేషన్ అధ్యయనంలో వెల్లడైంది. ఆ అధ్యయనం ప్రకారం.. అన్నం పులిస్తే ఐరన్, పొటాషియమ్, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాల స్థాయి పెరుగుతుంది. అందుకే చద్దన్నంలో ఆ పోషకాల పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు రాత్రి వండిన అన్నంలో 100 గ్రాములకు 3.4 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటే.. తెల్లారేసరికి అది 73.91 మిల్లీ గ్రాములకు పెరుగుతుంది. బీ6, బీ12 విటమిన్లు కూడా ఎక్కువగా లభిస్తాయి. అందుకే చద్దన్నం తింటే శరీరం తేలికగా ఎనర్జిటిక్‌గా ఉంటుంది.

అంతేకాదు చద్దన్నంతో శరీరానికి కావాల్సినంత బ్యాక్టీరియా లభిస్తుంది. ఒంట్లో వేడి చేయడం కారణంగా మన బాడీలో కలిగే దుష్ఫలితాలను చద్దన్నం తగ్గిస్తుంది. తరచూ చద్దన్నం తినడంవల్ల ఫైబర్ కంటెంట్ పెరిగి మల బద్ధకం, నీరసం లాంటి సమస్యలు తగ్గిపోతాయి. అదేవిధంగా రక్తపోటు (బీపీ) అదుపులో ఉండి, ఆందోళన తగ్గుతుంది. శరీరం ఎక్కువసేపు ఉల్లాసంగా ఉండటానికి తోడ్పడుతుంది. అంతేగాక ఒంట్లోని అలర్జీ కారకాలు, మలినాలు తొలగిపోతాయి. పేగుల్లో అల్సర్ల వంటివి ఉంటే తగ్గిపోతాయి. ఎదిగే పిల్లలకు కూడా చద్దన్నం మంచి పౌష్టికాహారం.

లావుంటే సన్నగా.. సన్నగుంటే లావుగా..

ఈ చద్దన్నం సన్నగా ఉన్నవాళ్లు లావయ్యేందుకు, లావుగా ఉన్నవాళ్లు సన్నబడేందుకు కూడా తోడ్పడుతుంది. లావు తగ్గాలంటే రాత్రి మిగిలిన అన్నాన్ని రాత్రే చల్లలో నానబెట్టుకుని ఉదయాన్నే తినాలి. రోజూ ఇలా చేయడంవల్ల స్థూలకాయులు క్రమంగా లావు తగ్గుతారు. అదేవిధంగా రాత్రి మిగిలిన అన్నంలో పాలుపోసి చిటికెడు పెరుగుతో తోడేసుకుంటే తెల్లారేసరికే తోడన్నం తయారవుతుంది. నిత్యం ఈ తోడన్నం తినడంవల్ల సన్నగా ఉన్నవాళ్లు క్రమంగా ఒళ్లు చేస్తారు. ఇలా పాలతో తోడేసిన అన్నాన్ని గానీ, చల్లలో నానబెట్టిన అన్నాన్నిగానీ నేరుగా తినబుద్ధికాకపోతే వాటికి ఉల్లిముక్కలు, టమాటా, క్యారెట్ లాంటివి కలుపుకుని తాలింపు పెట్టుకుని కూడా లాగించొచ్చు.

గమనిక : అయితే, ఇలా చేసి పెట్టుకున్న చద్దన్నాన్ని తప్పనిసరిగా ఉదయాన్నే తినాలి. మరింత ఆలస్యం చేస్తే అది ఎక్కువగా పులిసి అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది.

స్మార్ట్‌వాచ్‌లు ఆరోగ్యానికి నిజంగానే మేలు చేస్తాయా.. నిపుణులు ఏం చెబుతున్నారు..?

కబురు న్యూస్, ఆరోగ్యం, నవంబర్ 6 : స్మార్ట్‌వాచ్‌లు ప్రస్తుతం కేవలం అడుగుల సంఖ్యను లెక్కించడానికే కాకుండా గుండె స్పందన, నిద్ర, శారీరక శ్రమ వంటి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నాయి. కొన్ని పరికరాలు గుండె స్పందనలో అసాధారణ మార్పులను గుర్తించి హెచ్చరికలు కూడా ఇస్తున్నాయి. రోజువారీ అడుగుల సంఖ్య, గుండె వేగం, నిద్ర వ్యవధిని గమనించడం ద్వారా ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవచ్చు. అయితే స్మార్ట్‌వాచ్‌లో కనిపించే ప్రతి హెచ్చరికా అనారోగ్యానికి సంకేతం కాదు. ఫలితాలు సాధారణంగా ఉన్నంత మాత్రాన ఆరోగ్య సమస్యలు లేవని భావించకూడదు. కొన్ని పరికరాలు రక్తంలోని ఆక్సిజన్ స్థాయి, ఒత్తిడి అంచనాలు, గుండె స్పందనలో మార్పులను కూడా నమోదు చేస్తాయి. వీటి కచ్చితత్వం పరికరాన్ని బట్టి మారుతుంది. అందువల్ల మన ఆరోగ్య లక్ష్యాలకు ఉపయోగపడే వివరాలపైనే దృష్టి పెట్టాలి.

ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌ను గుర్తిస్తాయి..

కొన్ని స్మార్ట్‌వాచ్‌లు కర్ణిక దడ (ఏట్రియల్ ఫిబ్రిలేషన్) ఉండే అవకాశాన్ని గుర్తిస్తాయి. ఈ సమస్య వల్ల గుండెలో రక్తం గడ్డకట్టి మెదడుకు రక్తప్రసరణను అడ్డుకునే ఇస్కీమిక్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం సుమారు ఐదు రెట్లు పెరుగుతుంది. అయితే స్మార్ట్‌వాచ్ ఇచ్చే హెచ్చరిక వైద్య నిర్ధారణ కాదు. అసాధారణ గుండె స్పందన గురించి హెచ్చరిక వస్తే వైద్యుడిని సంప్రదించి అవసరమైన ఈసీజీ లేదా ఇతర పరీక్షలు చేయించుకోవాలి. మరోవైపు, ఎలాంటి హెచ్చరిక రాకపోయినా గుండె సమస్యలు లేవని నిర్ధారించలేం. స్మార్ట్‌వాచ్‌లు నేరుగా స్ట్రోక్‌ను నివారించలేవు. అయితే కర్ణిక దడను ముందుగా



గుర్తించి, వైద్య చికిత్స పొందేలా ప్రోత్సహించడం ద్వారా కొందరిలో స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అవసరమైతే వైద్యులు రక్తం గడ్డకట్టకుండా చేసే మందులను సూచిస్తారు.

అతిగా ఆధారపడకూడదు..

స్మార్ట్‌వాచ్‌లపై అతిగా ఆధారపడడం అనవసరమైన ఆందోళనకు దారితీస్తుంది. వ్యాయామం, నిద్ర, భావోద్వేగాల వల్ల గుండె స్పందన సహజంగానే మారుతుంది. పరికరాన్ని సరిగ్గా ధరించకపోవడం లేదా కదులుతూ కొలత తీసుకోవడం వల్ల కూడా ఫలితాల్లో తేడాలు వస్తాయి.. ప్రతి చిన్న మార్పునూ అనారోగ్యంగా భావించకూడదు. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రణ, సమతుల ఆహారం, వ్యాయామం, పొగాకుకు దూరంగా ఉండడం వంటి అలవాట్లు స్ట్రోక్ నివారణకు ముఖ్యమైనవి. ముఖం ఒకవైపు వాలిపోవడం, చేతిలో అకస్మాత్తుగా బలహీనత రావడం, మాట తడబడడం వంటి లక్షణాలు కనిపిస్తే స్మార్ట్‌వాచ్ హెచ్చరిక కోసం ఎదురుచూడకుండా వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి.

వైద్యుల నిర్ణయమే కీలకం..

స్మార్ట్‌వాచ్‌లు, వాటికి అనుసంధానమైన అనువర్తనాలు నిద్ర, గుండె స్పందన, శారీరక శ్రమ వంటి వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తాయి. ఈ వివరాలను ఎలా భద్రపరుస్తారు, ఎవరితో పంచుకుంటారు అనేది తయారీ సంస్థ, అనువర్తనం, వినియోగదారు ఇచ్చిన అనుమతులపై ఆధారపడి ఉంటుంది. ఆరోగ్య సమాచారం సున్నితమైనది కాబట్టి గోప్యతా విధానాలను చదివి, అవసరం లేని అనుమతులను ఇవ్వకూడదు. స్మార్ట్‌వాచ్‌లోని సమాచారం మొత్తం ఆటోమేటిక్‌గా ఆసుపత్రి రికార్డుల్లో చేరుతుందని కూడా భావించకూడదు. అయితే ఇవి ఆరోగ్యంపై అవగాహన పెంచే సాధనాలు మాత్రమే. వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, చికిత్సలకు ప్రత్యామ్నాయాలు కావని నిపుణులు తెలియజేస్తున్నారు.

ఆయుర్వేదం మందులు వాడితే వేడి చేస్తుందా?



కబురు న్యూస్, ఆరోగ్యం, నవంబర్ 6 : భారతీయ వైద్యమైన ఆయుర్వేదం ఎన్నో వేల ఏండ్ల నుంచి ఈ దేశంలో వాడుకలో ఉంది. అత్యంత ప్రజాదరణ పొందింది. బ్రిటిష్ వారు మన దేశానికి వచ్చేవరకు ఇదొక ఘనమైన వైద్యం. భారతీయులంతా ఆయుర్వేద మందులు వాడి తమ రోగాలను తగ్గించుకునేవారు. వైద్యులు తాళపత్రాలలో, ఇంటి పెద్దలు దీనిని గృహవైద్యంగా ఉపయోగించేవారు. కానీ బ్రిటిష్ పాలకులు మన దేశానికి అల్లోపతి వైద్యాన్ని తీసుకువచ్చారు. వారి సామ్రాజ్య విస్తరణలో భాగంగా ఇంగ్లిష్ వైద్యాన్ని ప్రజలలోకి తీసుకువచ్చారు. అందుకోసం ఏకంగా పట్టణాలలో మిషనరీ హాస్పిటల్స్‌నే ప్రారంభించారు. వాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆయుర్వేదానికి ఆదరణ తగ్గకపోవడంతో... రకరకాల కుయుక్తులు పన్నారు. అందులో భాగంగానే.. ఆయుర్వేద మందులు వాడితే వేడి చేస్తాయనే గోబెల్స్ ప్రచారం చేయడం ప్రారంభించారు.

ఆయుర్వేద మందులు వాడితే వేడిచేస్తాయని భావించిన ప్రజలు.. అప్పటినుంచి క్రమంగా ఆయుర్వేద మందుల స్థానంలో అల్లోపతి మందులు వాడటం ప్రారంభించారు. బ్రిటిష్ వాళ్లు ఆ రోజుల్లో ప్రారంభించిన దుష్ప్రచారం ఇప్పటికీ అలానే కొనసాగుతుండటం దురదృష్టకరం. 18వ శతాబ్దం తొలినాళ్లలో ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో అల్లోపతి వైద్యంలో కెమికల్ పొడులు, టించర్లు, వాటికి తాయారు చేసే ద్రావకాలు, చూర్ణాలు లాంటి మందులెన్నో ఇచ్చేవారు. వీళ్లు రసవాదానికి సంబంధించిన పాదరసము, సీసంలాంటి లోహాలను పరిశుభ్ర పరచకుండా చికిత్సలో భాగంగా వాడేవారు. దీనివల్ల విపరీతమైన వేడిచేసి ఒళ్లంతా దద్దుర్లు, మందుల తాలూకు వాసనలు, చెమటలు పట్టడం, కండ్లు తిరగడం, నాడీ తగ్గిపోవడం లాంటి సైడ్ ఎఫెక్ట్‌లు వచ్చేవి. అయితే శాస్త్రీయ స్ఫృహ పెరిగేకొద్ది వాళ్లు కొత్త సింథటిక్ మందులను వెలుగులోకి తెచ్చారు. వాళ్ల ఔషధాల లోపభూయిష్టమైన అంశాలను అప్పటికే అభివృద్ధి చెందిన ఆయుర్వేద ఔషధాలను కించ పరచాలనే దురుద్దేశంతో తకువ చేయడం మొదలుపెట్టారు. లోపభూయిష్టమైన వాళ్ల ఔషధాల పనితీరును, వేడిచేసే తత్వాన్ని ఆయుర్వేదానికి అంటకట్టారు.

ప్రపంచమంతా రెండు వందల ఏండ్ల క్రితం వరకు అందరూ ఆయుర్వేదమే వాడారు. చరిత్ర కారులు కానీ, ట్రావెలాక్స్ రాసిన అన్వేషికులైన మార్కోపోలో, అబ్దుల్ రజాక్, అల్ బెరూని ఫాహియన్, హుయాంగ్ సాంగ్, ప్లీని లాంటి యాత్రికులు భారత్ వచ్చినప్పుడు ఆయుర్వేదమే వాడారు. వీళ్లు ఎవరూ పుస్తకాలలో రాయలేదు. 500 ఏండ్ల నుంచి భారతదేశ సుగంధద్రవ్యాల కోసం పశ్చిమ సముద్రాలపై వచ్చిన యూరోపియన్ వర్తకులు భారతదేశంలో ఆయుర్వేదమే వాడారు. అది అలాగే 18వ శతాబ్దం వరకు నిరాఘాటంగా కొనసాగింది. చివరి మొగల్ చక్రవర్తి భగంధర (ఫిస్టులా) చిదమడం వల్ల పెద్ద సర్జరీ చేసినట్లు, బెంగాల్‌పై కప్పం తీసుకునే హక్కును కంపెనీ పాలకులకు అప్ప చెప్పారు. ఇప్పుడు అప్పుడు ఫిష్టులాకు అద్భుత వైద్యం చేసేవాళ్లు ఆయుర్వేద వైద్యులే.

మిరియాలు, యాలకులు, దాల్చిన చెక్క, షాజీరా, జాజికాయ, జాపత్రి, లవంగాలు, పిప్పళ్లు, బిరియాని ఆకులు, మరాఠీ మొగ్గ లాంటి మన సుగంధ ద్రవ్యాల కోసం బంగారం ఇచ్చి ఎగపడ్డారు. మనందరికి తెలిసి ఇవన్నీ వేడిచేసే పదార్థాలే కదా. వీటితో తయారైన బిర్యానీలు లొట్టలేసుకుంటూ తింటాం. ఈ పదార్థాల వల్ల యూరోపియన్ ఆహారం పాడవకుండా ఉంటుంది. దీనివల్ల లాభమే తప్ప నష్టం లేదు. మరి ఇలాంటి సుగంధ ద్రవ్యాలలోని కొన్ని పదార్థాలు ఆయుర్వేద ఔషధాలలో తకువ మోతాదులో వాటడం జరుగుతుంది. శీతాఫలాది చూర్ణం, తలీసాది చూర్ణం, అగస్త్య రసాయనం, పిప్పరి ఆసవం లాంటి ఔషధాలు జలుబు, ఎలర్జీలు, ఆయాసం, తుమ్ములు ఇతరత్రా శ్వాసకోశ వ్యాధులలో వాడతారు. ఇవన్నీ చాలా తీక్షణంగా, అద్భుతంగా పనిచేస్తాయి. ఎక్కువగా వేడిచేసిన దాఖలాలు ఎన్నడూ లేవు.

కొందదొరల వైద్యాలు, పసరు వైద్యాలు, వట్టికారం అన్నంతో వెల్లుల్లి ముద్దలు తినిపించే నాటు వైద్యాలు ఆయుర్వేద వైద్యం కాదు. ఆయుర్వేద వైద్యం అంటే చదువుకొని అనుభవం సంపాదించి, శాస్త్రీయ పద్ధతిలో ప్రాక్టీస్ చేసే ఒక అద్భుతమైన వైద్యశాస్త్రం. అనేకానేక దుష్ప్రచారాలు నమ్మడం వల్ల ప్రజలు మంచి ఆయుర్వేద వైద్యాన్ని పొందలేకపోతున్నారు. ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుంటే మేలు. దీనివల్ల ఇప్పుడు అనుభవిస్తున్న ఎన్నో దీర్ఘకాలిక రోగాలు అత్యంత చౌకగా, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మంచి వైద్యం పొందవచ్చు.

కండరాలు దృఢంగా మారాలంటే వాకింగ్ సరిపోతుందా.. దీంతో ఏం జరుగుతుంది..?

కబురు న్యూస్, ఆరోగ్యం, నవంబర్ 6 :: బరువు తగ్గాలని ప్రయత్నించేటప్పుడు కండరాల పరిమాణాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే శరీరంలో ఉపయోగకరమైన కండర కణజాలం తగ్గిపోకుండా, నిల్వ ఉన్న కొవ్వు మాత్రమే తగ్గేలా చూసుకోవడంలో కండరాల పాత్ర కీలకమైనది. కండరాలు శరీరంలో చురుకుగా పనిచేసే కణజాలం. మనం విశ్రాంతిగా ఉన్నప్పటికీ వాటి నిర్వహణకు నిరంతరం శక్తి అవసరమవుతుంది.



వాకింగ్ చక్కని వ్యాయామం..

ప్రతి వయసు వారికి, అన్ని రకాల శారీరక సామర్థ్యాలు ఉన్నవారికి నడక మంచి వ్యాయామం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు రక్త ప్రసరణను పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, జీర్ణక్రియ మెరుగు పడడానికి, మానసిక ఆరోగ్యం బాగుండడానికి సహాయపడుతుంది. తక్కువ ఒత్తిడితో చేయగలిగే వ్యాయామం కావడం, ప్రత్యేకమైన పరికరాలు అవసరం లేకపోవడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి నడక మంచి మార్గం. బరువు తగ్గాలనుకునేవారు సాధారణంగా మొదట ఎంచుకునే వ్యాయామం కూడా ఇదే. నడవడం వల్ల కేలరీలు ఖర్చవుతాయి. శరీరం శక్తి కోసం ప్రధానంగా నిల్వ ఉన్న కొవ్వును వినియోగించుకునేలా ఇది తోడ్పడుతుంది.

కణజాలం ఇలా వినియోగం అవుతుంది..

ఆహారం ద్వారా తీసుకునే కేలరీల కంటే శరీరం ఖర్చు చేసే కేలరీలు ఎక్కువగా ఉన్నప్పుడు, శక్తి అవసరాల కోసం శరీరం తనలోని కణజాలాన్ని వినియోగించుకోవాల్సి వస్తుంది. సరైన శారీరక ప్రేరణ లేకపోతే కొవ్వుతోపాటు కండరాల పరిమాణం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఇక్కడ నడక ఉపయోగపడుతుంది. నడవడం వల్ల కండరాలకు స్వల్పమైన యాంత్రిక ప్రేరణ అందుతుంది. ఇది కండరాల కణజాలాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతూ, కొవ్వు తగ్గే ప్రక్రియకు తోడ్పడుతుంది. అయితే నడక మాత్రమే కండరాలను గణనీయంగా పెంచుతుందని భావించకూడదు.

కండరాలు ఎలా ప్రభావితం అవుతాయి..

క్రమం తప్పకుండా వ్యాయామం చేయని వారు లేదా కొత్తగా శారీరక శ్రమను ప్రారంభించేవారు నడక ద్వారా కొంత కండరాల పెరుగుదలను పొందవచ్చు. నడిచేటప్పుడు శరీర బరువును కాళ్లు మోయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కండరాలకు ఒక రకమైన నిరోధక వ్యాయామంలా పనిచేస్తుంది. అయితే అన్ని కండరాలపై తగినంత ఒత్తిడి పడకపోవడం వల్ల నడక ఒక్కటే కండరాల బలాన్ని గణనీయంగా పెంచలేదు. నడక వల్ల ప్రధానంగా కాలి కండరాలైన పిక్కల కండరాలు, తొడల ముందు భాగంలోని కండరాలు, వెనుక తొడ కండరాలు, పిరుదుల కండరాలతోపాటు శరీర మధ్యభాగం, తుంటి కదలికలకు సహాయపడే కండరాలు ప్రభావితమవుతాయి.

కండరాలు మరింత దృఢమవ్వాలంటే..


నడకతోపాటు కండరాల పెరుగుదలను మరింత మెరుగుపరచాలనుకుంటే వ్యాయామ తీవ్రతను, నిరోధకతను పెంచుకోవాలి. సాధారణ రహదారిపై నడవడం కంటే ఎత్తైన వాలుపై నడవడం వల్ల పిరుదులు, తొడల వెనుక భాగం, పిక్కల కండరాలపై ఎక్కువ భారం పడుతుంది. బరువులు మోస్తూ నడవడం వల్ల కాళ్లు, శరీర మధ్యభాగం, పైవీపు కండరాలు మరింత శ్రమించాల్సి వస్తుంది. అలాగే ప్రతి పది నిమిషాల నడక తర్వాత కొద్దిసేపు ఆగి 15 సార్లు సాధారణ స్క్వాట్స్, 10 సార్లు నడుస్తూ చేసే లంజెస్ లేదా 15 సార్లు పిక్కల కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయవచ్చు. నెమ్మదిగా నడవడానికి బదులుగా వేగంగా నడిచే విరామాలను కూడా చేర్చుకోవచ్చు. వేగంగా నడిచేటప్పుడు కింది శరీర భాగాల కండరాలు మరింత చురుకుగా పనిచేస్తాయి.

రోజువారీ జీవితంలో నడకను భాగం చేసుకోవడం బరువు తగ్గడానికి, అదే సమయంలో ముఖ్యమైన కండరాల కణజాలాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అయితే కండరాలను గణనీయంగా బలోపేతం చేయాలంటే నడకతోపాటు తగిన నిరోధక వ్యాయామాలు కూడా అవసరమవుతాయని నిపుణులు చెబుతున్నారు.



దక్షిణాది సినిమాలపై బాలీవుడ్ నటుల విమర్శలు సరికాదు: రెజీనా కసాండ్రా!

భారతీయ సినీ పరిశ్రమలో 'నార్త్ వర్సెస్ సౌత్' చర్చ ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఈ ప్రాంతీయ చర్చకు మళ్లీ తెరలేపాయి. సౌత్ సినిమాపై ఉత్తరాది నటీనటులు చేసే విమర్శలను ఆమె తీవ్రంగా తప్పుబట్టడంతో పాటు, హిందీ చిత్రసీమలో తనకు ఎదురైన చేదు అనుభవాలు, ప్రాంతీయ వివక్షను బయటపెట్టారు. జాన్వీ కపూర్, రాధికా ఆప్టే వంటి బాలీవుడ్ నటులు ఇటీవల సౌత్ సినిమా ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలపై రెజీనా స్పందిస్తూ.. ఉత్తరాది నటులు దక్షిణాది సినిమాల గురించి ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల ఇండస్ట్రీల మధ్య అనవసరమైన విభేదాలు వస్తాయని అన్నారు. సౌత్ సినిమాలలో నిజంగానే సమస్యలు ఉన్నాయని భావిస్తే, ఆ ప్రాజెక్ట్‌లలో నటించకుండా వారు ముందే ఎందుకు బయటకు వచ్చి ఉండకూడదని సూటిగా ప్రశ్నించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, బాలీవుడ్‌లో తనకు ఎదురైన వివక్షను కూడా ఆమె పంచుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో తెరకెక్కిన భారీ చిత్రం 'కేసరి చాప్టర్ 2'లో తాను అక్షయ్ కుమార్ భార్యగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న పాత్రలో నటించినట్లు రెజీనా తెలిపారు. అయితే సినిమా ప్రమోషన్ల సమయానికి తన పట్ల జరిగిన తీరు తీవ్రంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలో కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రమోషన్లలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తన పేరును తొలగించారని, తనపై వచ్చిన పాటను విడుదల చేసినా సోషల్ మీడియాలో కనీసం ట్యాగ్ చేయలేదని వాపోయారు. తాను సౌత్ ఇండియన్ నటి అనే కారణంతోనే తనపై ఈ వివక్ష చూపించారా అంటూ ఆమె బాలీవుడ్ తీరును నిలదీశారు.



'చంద్రయాన్' నుంచి 'చీఫ్ సైంటిస్ట్' శివ కుమార్ దీకొండ పాత్ర పరిచయం!

ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల సమర్పణలో, 'సింబ స్క్రీన్ స్టోరీస్' పతాకంపై ప్రవీణ్ మొలక నిర్మిస్తోన్న వైవిధ్యమైన చిత్రం 'చంద్రయాన్' (జష్ట్రఱఅతీఱఅ). గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ అడ్వెంచర్ కామెడీ సినిమా నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ చిత్రం విడుదలకు ఇంకా 8 రోజులే ఉండడంతో పాత్రలను పరిచయం చేస్తుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా హీరోగా నటిస్తున్న శివ కుమార్ దీకొండ (శ్రీష్ట్రఱఱు ఖబఱ్ఱతీ ణష్ట్రవవనశీఅఱు) పాత్రను చిత్ర యూనిట్ అత్యంత ఆసక్తికరంగా పరిచయం చేసింది. ఈ మిషన్ వెనుక ఉండే అసలు మాస్టర్ మైండ్ మరియు 'చీఫ్ సైంటిస్ట్' (జష్ట్రఱవట శ్రీఱఅవత్ఱర్) అంటూ శివకుమార్ దీకొండ లుక్‌తో కూడిన కొత్త ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. సమాజంలో తమని తక్కువ చేసి మాట్లాడిన వారి ముందు తమ ప్రతిభను నిరూపించుకోవాలని నలుగురు గ్రామీణ యువకులు గట్టిగా నిర్ణయించుకుంటారు. ఎవరికీ అంతుచిక్కని ఆలోచనగా సొంతంగా ఒక రాకెట్ తయారు చేసి, ఏకంగా చంద్రమండలానికి వెళ్లాలని వారు సాహసించడమే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ క్రమంలో మందమర్రి నుంచి చందమామ వరకు సాగే ఈ ప్రయాణం ఆద్యంతం నవ్వులు పూయించనుంది. శివ కుమార్ దీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, 'బలగం' సత్యనారాయణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు

నయనతార 'మహాశక్తి'కి తెలుగులో గట్టి పరీక్ష.. పోటీగా 'రామాయణ', 'సీన్'!

దక్షిణాది లేడీ సూపర్‌స్టార్ నయనతార ఈ ఏడాది మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ ఏడాది పలు చిత్రాలతో సందడి చేసిన ఆమె.. ఇప్పుడు 'మూకుత్తి అమ్మన్ 2'తో థియేటర్లలోకి వస్తున్నారు. తెలుగులో ఈ సినిమా 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ భక్తిరస ప్రధానమైన చిత్రంపై తమిళ ప్రేక్షకుల్లో కొంత ఆసక్తి కనిపిస్తున్నప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం విడుదలకు ముందు ఆశించిన స్థాయిలో సందడి కనిపించడం లేదు. నవంబర్ 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన ఈ సినిమాలో నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో కనిపించనున్నారు. అయితే ఈసారి కథను మరింత భారీ స్థాయిలో, పౌరాణిక అంశాలు, దైవశక్తి నేపథ్యంలో తెరకెక్కించినట్లు ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. గతంలో వచ్చిన మొదటి భాగం భక్తితో పాటు వినోదం, సామాజిక అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఆకట్టుకుంది. రెండో భాగానికి సుందర్ సి దర్శకత్వం వహించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సినిమాలో రెజీనా కసాండ్రా ప్రతినాయిక పాత్రలో నటిస్తున్నారు. కన్నడ నటుడు దునియా విజయ్, అజయ్ ఘోష్, ఊర్వశి, అభినయ, యోగి బాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రౌడీ పిక్చర్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించాయి. భారీ తారాగణం, భక్తి నేపథ్యం, గ్రాఫిక్స్‌తో కూడిన దృశ్యాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర బృందం భావిస్తోంది. తమిళంలో నయనతారకు ఉన్న క్రేజ్‌తో 'మూకుత్తి అమ్మన్ 2'పై అంచనాలు ఉన్నాయి. కానీ తెలుగులో మాత్రం 'మహాశక్తి'కి విడుదలకు ముందు పెద్దగా ప్రచార హడావుడి కనిపించడం లేదు. దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఆరంభాన్ని అందుకుంటుందనే ఆసక్తి నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్ర పంపిణీ బాధ్యతలను మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ చేపట్టింది. విడుదలకు ముందు ప్రచారం కంటే ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందనే సినిమాకు కీలకం కానుంది. నవంబర్ 6న 'మహాశక్తి'కి బాక్సాఫీస్ వద్ద పోటీ కూడా గట్టిగానే ఉండనుంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణ' థియేటర్లలో సందడి చేస్తుండగా, అదే రోజున సూర్య నటించిన 'సీన్' కూడా విడుదల కానుంది. ఈ రెండు సినిమాల మధ్య 'మహాశక్తి'కి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం సవాలుగా మారింది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లో ముందుగానే ఆసక్తి పెంచుకోలేకపోవడం సినిమాకు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

రణ్‌బీర్-సాయిపల్లవిల 'రామాయణ - 1' మెప్పించిందా?



రామాయణం రివ్యూ

సినిమా పేరు: రామాయణం
తారాగణం: రణబీర్‌కపూర్, సాయిపల్లవి, యశ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, రవి దూబే, వివేక్ ఒబెరాయ్, అరుణ్‌గోవిల్.
దర్శకత్వం: నితీశ్ తివారీ
నిర్మాత: నమిత్ మల్హోత్రా
సంగీతం: హన్స్ జిమ్మర్, ఏ.ఆర్.రెహమాన్

భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది నితీశ్ తివారీ 'రామాయణ'. ప్రకటన వచ్చిన నాటి నుంచే ఈసినిమాపై అంచనాలు మొదలయ్యాయి. రాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్, కైకసిగా శోభన, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్.. ఇలా తారాగణ వివరాలు తెలియగానే ఆ అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రచార చిత్రాలు సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఫస్ట్ పార్ట్ ఈ దీపావళికి, నెక్స్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి అని ప్రకటించగానే, తొలిపార్ట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురు చూశారు. అనుకున్నట్టే 'రామాయణ -- 1' సినిమా గురువారం థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చింది. మరి అందరి అంచనాలనూ ఈ సినిమా అందుకున్నదా? ఈ సినిమాకు ముందు బాలీవుడ్‌లోనే తెరకెక్కిన 'రామాయణ' ఇతిహాసం 'ఆది పురుష్' ఆడియన్స్‌కి, నిర్మాతలకు చేదు అనుభవాలను మిగిల్చింది. మరి నితీశ్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ 'రామాయణం' ప్రేక్షకుల ఎలాంటి అనుభూతినిచ్చింది? అనేది తెలుసుకునే ముందు కథలోకి వెళ్లాలి.

కథ

ఇది యుగయుగాలుగా భారతీయుల రక్తంలో జీర్ణించుకుపోయిన కథ. కాబట్టి రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది జగమెరిగిన కావ్యం. అయితే.. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందించారు కనుక, ఈ తొలి భాగం దశాననుడు రావణుడిగా మారిన పరిణామక్రమాన్ని, శ్రీరాముడి జన్మవృత్తాంతం, తాటక వధ, శివధనుర్భగం, సీతారామలక్ష్మణ వనవాసం, కబంధుని వధ, కరదూషణాధుల వధ, సీతాపహరణం, జటాయు మరణం ఘట్టాలతో సాగింది. జాటాయు మరణానంతరం 'రావణుడ్ని సంహరించబోతున్నాను' అంటూ రాముడు ప్రతిజ్ఞ చేయడంతో ఈ తొలి భాగం ముగిసింది. ఇక సుందరకాండ, రావణ వధ, శ్రీరామపట్టాభిషేకం తదితర అంశాలన్నీ రెండో పార్ట్‌లో ఉంటాయన్నమాట.

విశ్లేషణ

దేవదానవ సంగ్రామంలో ఓడిపోయి, రాజ్యాన్ని పోగొట్టుకొని పాతాళలోకంలో తలదాచుకున్న రాక్షస జాతికి పునరుజ్జీవాన్ని అందించేందుకు దానవరాణి కైకసి, తన తనయుడు దశాననుడిలోని పౌరుషాగ్నిని రగిల్చడం, ఘోర తపస్సు చేసి, బ్రహ్మ దేవుడి వరాన్ని పొందిన దశాననుడు దానవసామ్రాట్టు రావణబ్రహ్మగా లంకా రాజ్య సింహాసన్నా అధిష్టించడంతో కథ మొదలైంది. ప్రతినాయకుడి శక్తిసామర్థ్యాలను అద్భుతంగా ఆవిష్కరించి, కథానాయ కుడు సాధించబోయే కార్యం ఎంత కష్టతరమైనదో ప్రేక్షకు లకు వివరించడంలో ముందు దర్శకుడు నితీశ్ తివారీ సక్సెస్ అయ్యారు. నిజానికి రావణుడి పాత్రకు ఆయనిచ్చిన ఎలివేషన్స్ రాముడికి కూడా ఇవ్వలేదు. నిజానికి రాముడికి ఎలివేషన్ అవసరం లేదు కూడా. రావణుడనేవాడు ఎంతటి మహావీరుడైనా, శక్తివంతుడైనా చివరకు వాడు పోయేది రాముడి చేతిలోనే అని ఆడియన్స్‌కి తెలుసు కాబట్టి, ఎలివేషన్స్ అవసరం లేదనుకుని ఉండొచ్చు. సాదాసీదాగా రాముడి పాత్రను కథలోకి ప్రవేశింపజేసి, నిదానంగా ఆడియన్స్‌కి 'శ్రీరాముడు' అనే వ్యాక్సిన్‌ని ఆడియన్స్‌కి ఇంజెక్ట్ చేశాడు దర్శకుడు నితీశ్. సినిమా చూడంగ చూడంగ.. రణబీర్‌లో రాముడ్ని చూడటం మొదలుపెట్టారు ఆడియన్స్. రణబీర్ కూడా అభినయం విషయంలో అద్భుతం అనిపించాడు. అయితే.. అతని ఆహార్యం బావున్నా.. నీలమేఘశ్యాముడిగా రాముడ్ని చూపించకపోవడం తెలుగువారికి మింగుడు పడదు. అందుకే.. రణబీర్‌ని రాముడిగా ఒప్పుకోవడానికి కాస్తంత టైమ్ పడుతుంది. నిజానికి 'రామాయణం'లోని బాలకాండ, అరణ్యకాండ కాస్త స్లోగా అనిపిస్తాయి. కానీ దర్శకుడు నితీశ్ తివారీ ఎక్కడా జనానికి విసుగు అనిపించకుండా, తొలి పావుగంట రావణాసుడి ఎపిసోడ్ తో, తర్వాత తాటక వధ, కంబధ వధ, కరదూషణాదుల వధ, జటాయు మరణం.. లాంటి అద్భుతమైన యుద్ధ సన్ని వేశాలను హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించి, ఎక్కడా ల్యాగ్ అనిపించకుండా ఆసక్తికరంగా, అందరికీ నచ్చేలా తీసి, సక్సెస్ అయ్యారు. అయితే.. ఇప్పటివరకూ రావణమాత కైకసి పాత్రను పాజిటీవ్‌గానే మనం చూశాం.కానీ ఈ సినిమాలో కైకసి నుంచి రావణుడ్ని విష్ణుద్వేషం మొదలైనట్టు చూపించారు. అలాగే.. శ్రీరాముడి ముందు భార్గవరాముడు మోకరిల్లడం లాంటి సీన్స్ కూడా జనానికి మింగుడు పడవు. అయితే.. మిగతా సన్నివేశాలన్నీ జనరంజకంగా తెరకెక్కించారు. మొత్తంగా తొలిభాగంతోనే దర్శకుడు నితీశ్ జనాల్లో మంచి మార్కులు సంపాదించుకున్నారు.

నటీనటులు

రాముడిగా రణబీర్ చక్కగా అభినయించాడు. పరశు రాముడిగా కూడా ఓ సన్నివేశంలో కనిపించి అదరహో అనిపించుకున్నారు. ఇక సీతగా సాయిపల్లవి ఒదిగిపోయి నటించింది. ఆమె ఆహార్యం, అభినయం నిజంగా అద్భుతం. ఇందులో సీతను కూడా ఓ యోధురాలిగా చూపించి, ఓ కొత్త ప్రయోగానికి తెరలేపారు దర్శకుడు నితీశ్. రామాయణాన్ని నిశితంగా గమనించిన వారికి, అలా చూపించడం తప్పు కాదు అనిపిస్తుంది. ఎందుకంటే.. మహావీరులు, మహాబలులు సైతం ఎత్తలేని శివధనుస్సును అలవోకగా ఎత్తిన మహాబలశాలి సీతామ్మ. అలాంటి సీతమ్మ యోధురాలు ఎందుకు కాకూడదు?. మొత్తంగా సాయిపల్లవి సీతగా చాలా బాగా నటించింది. సీతాసాధ్విగా, వీరనారిగా పలు కోణాలను ఆమె పలికించిన తీరు బావుంది. లక్ష్మణుడిగా రవి దూబే కూడా బావున్నాడు. ఇక రావణుడిగా యశ్ అయితే.. విశ్వరూపం చూపించాడు. శూర్పణఖ పాత్రకు రకుల్ ప్రీత్‌సింగ్ నటన ఓ గౌరవాన్ని తెచ్చింది. మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రలకు న్యాయం చేశారు.

సాంకేతికంగా

సాంకేతికంగా అన్ని విభాగాలూ బాగా పనిచేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజన్స్(ఏఐ) ఉపయోగించి డబ్బింగ్ విషయంలో, అచ్చంగా తెలుగు సినిమాను చూస్తున్న అనుభూతినే తీసుకురాగలిగారు. లిప్ సింక్ కూడా సరిగ్గా సరిపోయింది. కెమెరా పనితనం బావుంది. ఏఆర్ రెహమాన్ పాటలు, నేపథ్య సంగీతం భావగర్భితంగా, కథ స్థాయికి తగ్గట్టుగా సాగింది. యాక్షన్ అంశాలను కూడా అద్భుతంగా తెరకెక్కించారు. సీజీ వర్క్ అయితే.. నేచురల్‌గా అనిపించింది. మొత్తంగా నిర్మాత పెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. రావణాడ్ని సంహరిస్తానని రాముడు చెప్పడంతో ప్రథమార్థం ముగిసింది. సెకండ్‌పార్ట్‌లో ఆంజనేయుడు రాబోతున్నాడని హింట్ ఇస్తూ.. ఆంజనేయుడి బిట్స్‌ని చూపించి, సముద్రాన్ని లంఘిస్తున్న మారుతిగా సన్నీడియోల్‌ని వెనకనుంచి చూపించడం ఆడియన్స్‌కి గూస్‌బంప్స్ తెప్పించాయి. హనుమాన్‌చాలీసా వస్తుండగా టైటిల్స్ దిగుతుంటే.. ఆంజనేయుడి ఆగమానం గుర్తొచ్చి జనం భావోద్వేగానికి లోనయ్యారు.

చివరిగా ఇంటిల్లిపాదీ కలిసి చూడాల్సిన సినిమా 'రామాయణం'.

బలాలు

కథనం, నటీనటుల నటన, సాంకేతికత..

బలహీనతలు

పాత్రలకు విరుద్ధంగా అనిపించిన కొన్ని సన్నివేశాలు

రేటింగ్ 3/5

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040